# అగ్రనేత


తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279


రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :139 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: మంగళవారం 05-08-2025 | పేజీలు:4 వెల: 2.00


## భారీ భద్రతా వైఫల్యం.. ట్రంప్ గోల్ఫ్ క్లబ్‌వైపు దూసుకొచ్చిన విమానం.. రంగంలోకి దిగిన ఫైటర్ జెట్స్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గోల్ఫ్ రిసార్ట్ వద్ద భారీ భద్రతా వైఫల్యం బయటపడింది. న్యూజెర్సీ లో గోల్ఫ్ క్లబ్ సమీపంలో నోఫ్లైజోన్ ప్రాంతంలోకి ఓ ప్రయాణికుల విమానం దూసుకొచ్చింది. వెంటనే అప్రమత్తమైన ఫైటర్ జెట్స్ రంగంలోకి దిగాయి



## రాహుల్‌పై పరువునష్టం కేసులో సుప్రీం స్టే



భారత భూభాగాన్ని చైనా ఆక్రమించిందంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. మీరు నిజమైన భారతీయులే అయితే ఇలాంటి మాటలు మాట్లాడరని ఘాటు వ్యాఖ్యలు చేసింది. 'చైనా మన దేశ భూభాగాన్ని ఆక్రమించింది' అని రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై దాఖలైన కేసు విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు పై వ్యాఖ్యలు చేసింది.

## చాలాకాలం తర్వాత స్వల్పంగా బలపడ్డ రూపాయి

అమెరికన్ డాలర్ తో పోల్చితే రూపాయి మారకం విలువ సోమవారం స్వల్పంగా బలపడింది. కొంతకాలంగా క్షీణిస్తూ వస్తున్న రూపాయికి ఇది కాస్త ఊరటగా చెప్పవచ్చు. ఇవాళ ఫారెక్స్ మార్కెట్ లో డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ 87.36 రూపాయల వద్ద స్థిరపడింది. దాంతో ఈ ఏడాదిలో నమోదైన గరిష్ఠ పతనం నుంచి రూపాయి కాస్త కోలుకున్నట్లయ్యింది. %ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ అత్యంత కనిష్ఠ స్థాయికి పడిపోయింది. ఆ సమయంలో ఒక డాలర్‌కు రూ.88.10 వరకు చెల్లించాల్సి వచ్చింది. దాంతో పోలిస్తే ఇవాళ్టి 87.36 రూపాయలు కొంత సానుకూలమని చెప్పవచ్చు. అయితే ఈ మధ్యకాలంలో రూపాయి తీవ్ర ఒడిదొడుకులను ఎదుర్కొంటోంది. గడిచిన ఏడాది కాలంలో రూపాయి విలువ 4.06 శాతం బలహీనపడగా.. గత నెల రోజుల్లోనే 1.77 శాతం పతనమైంది. ఈ ఏడాది జనవరి నుంచి చూసినప్పుడు డాలర్‌పై రూపాయి విలువ సుమారు 1.82 శాతం మేర నష్టపోయింది. దేశ ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన గణాంకాలు, రిజర్వ్ బ్యాంక్ చర్యలు, లేదా ప్రపంచ మార్కెట్లలోని సానుకూల సెంటిమెంట్ లాంటి కారణాలవల్ల రూపాయికి డిమాండ్ పెరిగి ఉండవచ్చని భావిస్తున్నారు. అయితే ఈ పురోగతి తాత్కాలికమే కావచ్చని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ త్రైమాసికం చివరి నాటికి డాలర్‌తో రూపాయి మారకం విలువ తిరిగి 87.52 రూపాయలకు చేరే అవకాశం ఉంది. రాబోయే 12 నెలల్లో కూడా రూపాయి మారకం విలువ స్వల్పంగా క్షీణించవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఆర్థిక వ్యవస్థలో స్థిరమైన మెరుగుదల ఉంటేనే రూపాయి విలువ దీర్ఘకాలంలో నిలదొక్కుకుంటుందని నిపుణులు చెబుతున్నారు.

## కొండ పైనుంచి దూకి యువకుడు మృతి



ముంబై: ఒక యువకుడు మొబైల్ ఫోన్ కొనాలని తల్లిని పలుమార్లు అడిగాడు. అయితే ఆమె నిరాకరించింది. ఈ నేపథ్యంలో కొండ పైనుంచి కిందకు దూకాడు. తీవ్రంగా గాయపడి మరణించాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్‌లో ఈ సంఘటన జరిగింది. 16 ఏళ్ల అథర్వ గోపాల్ టేడే, పోలీస్ నియామక పరీక్ష కోసం ప్రిపేర్ అవుతున్నాడు. తనకు మొబైల్ ఫోన్ కొని ఇవ్వాలని తల్లిని పలుమార్లు అడిగాడు. అయితే ఆమె ప్రతిసారి నిరాకరించింది. కాగా, గోపాల్ ఆదివారం కూడా మొబైల్ ఫోన్ కొనమని తన తల్లిని మరోసారి అడిగాడు. ఆమె నిరాకరించింది. దీంతో ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. టిస్‌గావ్‌లోని కొండపైకి ఎక్కి అక్కడి నుంచి కిందకు దూకాడు. మరోవైపు గమనించిన స్థానికులు తీవ్రంగా గాయపడిన గోపాల్‌ను వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. అయితే అతడు అప్పటికే మరణించినట్లు డాక్టర్లు తెలిపారు. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి వెల్లడించారు.

## కరెంట్ సమస్యను పరిష్కరించండి



వేల్పూర్ : నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండలం పడగల్ గ్రామంలో సాగుకు కరెంట్ సరఫరా సమస్యతో పంటలు ఎండిపోయే పరిస్థితి ఉందని రైతులు మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే ఎలక్ట్రిసిటీ ఎస్ఈతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను వెంటనే పరిష్కరించాలని సూచించారు. మూడు రోజుల క్రితం గ్రామంలో పంటలకు అసలు కరెంట్ లేదని, అలాగే గత రెండు రోజులుగా ఒక వైపు ఆరు గంటలు మరో వైపు ఆరు గంటలు కరెంట్ ఇస్తున్నారని, దీనివల్ల పంటలకు నీరు సరిగ్గా అందక మొక్కజొన్న పంట ఎండిపోయే ప్రమాదం ఉంది అని ఎమ్మెల్యే ఎస్ఈ దృష్టికి తీసుకెళ్లారు. రైతులందరు సబ్ స్టేషన్ వెళ్లి అధికారులను అడిగితే లో ఓల్టేజ్ సమస్య అని, 3 కెపాసిటర్ సేల్స్, 4 బ్యాటరీలు ఉంటే సమస్య పరిష్కారం అవుతుందని చెబుతున్నారన్నారు. వెంటనే మెటీరియల్ సప్లై చేసి కరెంట్ సమస్య త్వరితగతిన పరిష్కరించి రైతులకు కరెంట్ ఇబ్బంది లేకుండా చూడాలని ఎస్ఈని ఎమ్మెల్యే ఆదేశించారు.

## శిబూ సోరెన్ మృతిపట్ల కేసీఆర్ సంతాపం..



హైదరాబాద్: జార?ండ్ ముక్తి మోర్చా అధినేత, జార?ండ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి శిబూ సోరెన్ మృతి పట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సంతాపం వ్యక్తంచేశారు. ఆయన మరణం జార?ండ్, తెలంగాణ వంటి దేశ ప్రాంతీయ అస్తిత్వ రాజకీయాలకు, జాతీయ ఫెడరల్ స్ఫూర్తికి, ఆదివాసీ సమాజానికి తీరని లోటని అన్నారు. ఈ సందర్భంగా శిబూ సోరెన్‌తో తనకున్న వ్యక్తిగత అనుబంధాన్ని, తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమానికి వారందించిన సహకారాన్ని స్మరించుకున్నారు. దేశ ఫెడరల్ స్ఫూర్తిని ప్రతిఫలించే దిశగా, శిబూ సోరెన్ చేపట్టిన జార?ండ్ స్వరాష్ట్ర ఏర్పాటు ఉద్యమం, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమానికి స్ఫూర్తి నింపిందన్నారు. 2001లో తెలంగాణ రాష్ట్ర సమితి స్థాపన సమయంలో శిబూ సోరెన్‌ని హైదరాబాద్‌లో జరిగిన తొలి సభకు మొదటి అతిథిగా ఆహ్వానించుకున్నామని గుర్తు చేశారు. నాటి తెలంగాణ ఉద్యమానికి ఆయన తెలిపిన సంపూర్ణ సంఘీభావం మర్చిపోలేనిదని చెప్పారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను గుర్తించిన శిబూ సోరెన్, తాను ప్రారంభించిన తెలంగాణ మలిదశ ఉద్యమానికి అండగా నిలిచారని కేసీఆర్ తన కృతజ్ఞతా భావాన్ని వ్యక్తం చేశారు. 2014లో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సమయంలో కూడా శిబూ సోరెన్ మద్దతుగా నిలిచారని, జార?ండ్, తెలంగాణ ప్రజల ఉద్యమ విజయాలు దేశ ఫెడరల్ స్ఫూర్తికి, ప్రాంతీయ, సామాజిక న్యాయానికి దిక్సూచిగా నిలిచాయని కేసీఆర్ తెలిపారు. శిబూ సోరెన్ నేతృత్వంలోని జేఎంఎం పార్టీ తెలంగాణ ఉద్యమ సమయంలో కేంద్రంలో ఉన్న యూపీఏ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉండడంతో రాష్ట్ర ఏర్పాటు కోసం ఒత్తిడి తేవడంలో కీలక పాత్ర పోషించిందని వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతర కాలంలో 2022లో జార?ండ్‌లో శిబూ సోరెన్‌ని కలిసి వారి ఆశీస్సులు తీసుకున్న విషయాన్ని కేసీఆర్ గుర్తు చేసుకున్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. తండ్రిని కోల్పోయి దుఃఖ సంద్రంలో మునిగిన వారి కుమారుడు జార?ండ్ సీఎం హేమంత్ సోరెన్‌కు, వారి కుటుంబ సభ్యులకు కేసీఆర్ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## షోలే చిత్రానికి 50 ఏళ్లు.. పార్లమెంట్‌లో హేమామాలినీ ఏమన్నారంటే

న్యూఢిల్లీ: సూపర్‌హిట్ బాలీవుడ్ ఫిల్మ్ షోలే చిత్రం రిలీజై 50 ఏళ్లు అయ్యింది. అప్పట్లో బాక్సాఫీసు రికార్డులు తిరగరాసింది. యాక్షన్, డైలాగ్స్‌తో ఆ ఫిల్మ్ సెన్సేషన్ క్రియేట్ చేసింది. ఆ ఫిల్మ్‌లో ధర్మేంద్ర, అమితాబ్, హేమామాలినీ, అంజద్ ఖాన్ ప్రధాన పాత్రలు పోషించారు. అయితే డ్రీమ్‌గర్ల్ హేమామాలినీ ప్రస్తుతం లోక్‌సభలో ఎంపీగా కొనసాగుతున్న విషయం తెలిసిందే. షోలే చిత్రానికి 50 ఏళ్లు నిండిన నేపథ్యంలో ఆమె సెలబ్రేట్ చేసుకుంది. యూపీలోని మథుర నియోజకవర్గానికి చెందిన ఆ అందాల నటి ఇవాళ పార్లమెంట్ ఆవరణలో షోలే చిత్రం గురించి మాట్లాడారు. విలేఖరి అడిగిన ప్రశ్నకు బదులిస్తూ.. షోలే చిత్రంలో నటించడం గొప్ప అనుభూతి అని హేమామాలినీ పేర్కొన్నారు. షోలే చిత్రం కోసం పనిచేస్తున్న సమయంలో.. అప్పుడు ఆ ఫిల్మ్ అంత పెద్ద హిట్ అవుతుందని అనుకోలేదన్నారు. ఆ రోజులు వేరు అని, ఇప్పుడు మరో షోలే చిత్రాన్ని చేయడం కష్టమే అని హేమామాలినీ తెలిపారు. షోలే చిత్రం రిలీజై 50 ఏళ్లు అవ్వడం అంటే ఓ సంతోషకరమైన మైలురాయిని దాటినట్లు ఆమె చెప్పారు. ఆ ఫిల్మ్‌లో చేసిన అనుభవం చిరకాలం గుర్తుండిపోతుందని డ్రీమ్‌గర్ల్ తెలిపింది.





## భారీ వర్షాలు.. హెచ్చరించిన వాతావరణశాఖ



తెలంగాణలోని పలుచోట్ల ఈ నెల 8 వరకు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. ఉపరితల ఆవర్తనం నైరుతి బంగాళాఖాతం, ఉత్తర తమిళనాడు తీరం వెంట సముద్రమట్టానికి 3.1 నుంచి 5.8 కిలోమీటర్ల వరకు విస్తరించి ఉందని.. తూర్పు-పశ్చిమ ద్రోణి తూర్పు మధ్య అరేబియా సముద్రం దక్షిణ భాగాల నుంచి దక్షిణ ఇంటీరియర్ కర్నాటక, తమిళనాడు మీదుగా మధ్య బంగాళాఖాతం తీర ప్రాంతంలోని ఉపరితల ఆవర్తనం వరకు కొనసాగుతుందని.. సగటున 5.8 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉందని.. ఎత్తుకు వెళ్లే కొద్దీ దక్షిణం వైపు వంగి ఉందని పేర్కొంది. సోమవారం జయశంకర్ భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని పేర్కొంది. మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల మోస్తరు వర్షాపాతం నమోదయ్యే అవకాశాలున్నాయని చెప్పింది. బుధవారం నాగర్ కర్నూల్, జోగులాంబ గద్వాల జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని తెలిపింది. గురువారం మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో.. శుక్రవారం నల్గొండ, నాగర్ కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది.

## ఢిల్లీ-విజయవాడ ఎయిర్‌విస్తారా విమానంలో సాంకేతిక లోపం




ఢిల్లీ-విజయవాడ ఎయిర్‌విస్తారా విమానంలో సాంకేతిక లోపం తలెత్తింది. ఢిల్లీ నుంచి విజయవాడకు బయలుదేరాల్సిన విమానంలో సమస్య తలెత్తడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. షెడ్యూల్ ప్రకారం సోమవారం ఉదయం 9:30 గంటలకు టేకాఫ్ కావాల్సిన ఈ విమానం రన్‌వేపై ఉన్నప్పుడే సమస్య తలెత్తింది. వేగం పుంజుకున్న విమానాన్ని అకస్మాత్తుగా వేగం తగ్గించి రన్‌వే పైనుంచి పక్కకు తీశారు. దాంతో సుమారు 160 మందికిపైగా ప్రయాణికులు మూడు గంటలకుపైగా విమానంలోనే నిరీక్షించాల్సి వచ్చింది. మధ్యాహ్నం 12 గంటల తర్వాత ప్రయాణికులను విమానం నుంచి దింపి ప్యాసింజర్ లాంజ్‌కు తరలించారు. ఆ విమానంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్ కూడా ప్రయాణిస్తున్నారు. సాంకేతిక లోపం గురించి సిబ్బంది ప్రయాణికులకు సరైన సమాచారం ఇవ్వకపోవడంతోపాటు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడంతో ప్రయాణికులు అసహనం వ్యక్తంచేశారు. సిబ్బంది సరిగ్గా స్పందించడం లేదని, ఎన్నిసార్లు అడిగినా సమాధానం ఇవ్వడంలేదని ప్రయాణికులు ఆరోపించారు.

## ధర్నాలో మధ్యాహ్న భోజన కార్మికులు.. పస్తుల్లో పిల్లలు



ఆదిలాబాద్ :కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్న పథకాలు కొనసాగించకా, నిధులు మంజూరు చేయకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. తాజాగా పెండింగ్‌లో ఉన్న బిల్లులు మంజూరు చేయడంతో పాటు ఇతర సమస్యల సాధన కోసం జిల్లావ్యాప్తం గా మధ్యాహ్న భోజన కార్మికులు సోమవారం ధర్నా నిర్వహించారు. %విధులు బహిష్కరించి కార్మికులు నిరసన తెలపడంతో బడుల్లో చదువుతున్న పిల్లలు పస్తులు ఉండాల్సి వచ్చింది. కొన్ని చోట్ల విద్యార్థులు ఇంటి నుండే మధ్యాహ్న భోజనం తెచ్చుకుని కడుపు నింపుకున్నారు. ప్రభుత్వ బడుల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని ఓ వైపు ప్రభుత్వం గొప్పలు చెప్తుంటే..గతంలో సజావుగా సాగిన పథకాలు సైతం ఇటకెక్కుతున్నాయనడానికి వీరి ఆందోళనలే అద్దం పడుతున్నాయి.

## లేబర్ కమిషనర్‌ను కలవనున్న ఫిల్మ్ ఛాంబర్, ఫెడరేషన్ సభ్యులు




తెలుగు ఫిలిం ఇండస్ట్రీలో వర్కర్స్ ఫెడరేషన్‌కు చెందిన 24 కార్మిక సంఘాలు వేతనాల పెంపు కోసం సినిమా షూటింగ్‌లను నిలిపివేయాలంటూ బంద్‌కు పిలుపునిచ్చాయని తెలిసిందే. వర్కర్ల ప్రధాన డిమాండ్ వేతనాలను 30 శాతం మేర పెంచాలని.. ఈ మేరకు ఫెడరేషన్ ప్రతినిధులు ఫిలిం ఛాంబర్‌తో చర్చలు జరిపారు. అయితే ఈ చర్చలు అనుకూల ఫలితాలు ఇవ్వకపోవడంతో నిరసనగా బంద్ ప్రకటించారు. ఫెడరేషన్ బంద్ నేపథ్యంలో చాలా వరకు షూటింగ్స్ నిలిచిపోయినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో తెలుగు ఫిల్మ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ డిమాండ్లపై ఫిలిం ఛాంబర్‌లో నిర్మాతల మండలి అత్యవసరంగా సమావేశమైంది. అయితే ఈ సమావేశంలో కార్మికులకు 30 శాతం వేతనాల పెంపుపై నిర్మాతల మండలి ఎటూ తేల్చలేకపోవడంతో ఫిల్మ్ ఛాంబర్, ఫెడరేషన్ సభ్యులు సాయంత్రం 4 గంటలకు లేబర్ కమిషనర్‌ను కలవనున్నట్టు తెలుస్తోంది. అత్యవసరం సమావేశానికి తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ దిల్ రాజు, నిర్మాతలు అల్లు అరవింద్, మైత్రీ రవి, సురేశ్ బాబు, శివలెంక కృష్ణ ప్రసాద్, రాధామోన్. ఠాగూర్ మధు, బాపినీడు, ఫెడరేషన్ సభ్యులు, ఫిలించాంబర్ సభ్యులు హాజరయ్యారు. షూటింగ్‌లపై బంద్ ప్రభావం కొనసాగితే, సినిమాల విడుదల తేదీల్లో మార్పులు వచ్చే అవకాశం ఉంది. మరోవైపు ఈ వ్యవహారంలో ప్రభుత్వం జోక్యం చేసుకుంటుందా? లేదంటూ ఫిలిం ఛాంబర్, ఫెడరేషన్ మధ్య చర్చల ద్వారానే పరిష్కారం లభిస్తుందా? అన్నది తెలియాల్సి ఉంది.

## బీఆర్ఎస్ ఎమ్మెల్యేల మెరుపు ధర్నా



హైదరాబాద్: అసెంబ్లీ ఆవరణలోని గాంధీ విగ్రహం ముందు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మెరుపు ధర్నా నిర్వహించారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై వెంటనే అనర్హత వేటు వేయాలని నినాదాలు చేశారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను కలవడానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల బృందం శాసనసభ కార్యాలయానికి వెళ్లింది. అయితే స్పీకర్ అందుబాటులో లేకపోవడంతో అసెంబ్లీ ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద ఎమ్మెల్యేలు నిరసనకు దిగారు. పార్టీ ఫిరాయింపుల ఎమ్మెల్యేలను డిస్‌క్వాలిఫై చేయాలని నినానాదాలు చేశారు. అనంతరం గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. %కాగా, బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ధర్నాను కవర్ చేయకుండా మీడియాను పోలీసులు అడ్డుకున్నారు. శాసనసభ ఆవరణలో మీడియా ఆంక్షలు ఉన్నాయని చెప్పారు. మీడియా ప్రతినిధులు, పోలీసులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకోవడంతో అక్కడ స్వల్ప ఉద్రిక్తత ఏర్పడింది.

## లగేజీ బ్యాగులో రెండేళ్ల చిన్నారి..



క్రైస్ట్‌చర్చ్ : లగేజీ బ్యాగులో రెండేళ్ల అమ్మాయిని తీసుకెళ్తున్న మహిళను పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటన న్యూజిలాండ్‌లో జరిగింది. ఉత్తర దిక్కున ఉన్న కైవాకా అనే పట్టణంలో ఓ బస్సు లగేజీ నుంచి పాపను రక్షించారు. ఓ ప్రయాణికుడు లగేజీ కంపార్ట్‌మెంట్ యాక్సెస్ కావాలని కోరగా, ఆ సమయంలో డ్రైవర్ కదులుతున్న బ్యాగ్‌ను గుర్తించాడు. అయితే సూట్‌కేసును ఓపెన్ చేసిన సమయంలో.. దాంట్లో రెండేళ్ల అమ్మాయి ఉన్నట్లు గుర్తించామని పోలీసులు వెల్లడించారు. %ఈ ఘటనలో 27 ఏళ్ల అమ్మాయిని అరెస్టు చేశారు. ఆమెపై కేసు బుక్ చేశారు. బ్యాగేజీలో ఉన్న ఆ పాప చాలా వేడిగా ఉన్నట్లు గుర్తించారు. కానీ ఆ అమ్మాయికి భౌతికంగా ఎటువంటి హాని జరగలేదన్నారు. ప్రస్తుతం ఆ చిన్నారికి ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. లగేజీ తీసుకువచ్చిన మహిళ, దాంట్లో ఉన్న చిన్నారికి మధ్య రిలేషన్ ఏంటో ఇంకా తెలియలేదు. నార్త్ షోర్ డిస్ట్రిక్ట్ కోర్టులో ఆ మహిళను హాజరుపరిచారు. లగేజీని పసికట్టి ఆపిన డ్రైవర్‌ను పోలీసులు మెచ్చుకున్నారు.

# సంపాదకీయం

మంగళవారం 05-08-2025

## సత్యం వధ...

ప్రస్తుత రాజకీయ, సాంస్కృతిక వాతావరణంలో నకిలీ వార్తలు, అబద్ధాలు అసంఖ్యాకంగా ప్రచారంలోకి వస్తున్నాయి. ఈ స్థితిలో సగటు మనిషి సొంత భావనలను, వాస్తవాల ఆధారంగా మాట్లాడే సామర్థ్యాన్ని కోల్పోతున్నాడు. తిమ్మిని బమ్మిని చేసే పరిస్థితులూ వైఖరులకు లొంగిపోతున్నాడు. అలా మనుషులు వాస్తవాలను నిర్లక్ష్యం చేయడం, హేతుబద్ధత స్థానాన్ని భావోద్వేగాలు ఆక్రమించడం వల్ల సత్యానికి విలువ లేకుండా పోయింది. వర్తమానంలోని ఈ దుస్థితిని 'పోస్ట్-ట్రూత్' స్థితి లేదా 'సత్యానంతర ప్రపంచం' అంటున్నారు.

ఇరవయ్యో శతాబ్దంలో మానవ చరిత్రలో అత్యంత దారుణమైన రెండు అంశాలు ముందుకు వచ్చాయి. అవి... సత్యాన్ని ఉల్లంఘించడం, వాస్తవాలను కలుషితం చేయడం. హన్నా ఆరెంట్ తన 'ది ఆరిజిన్స్ ఆఫ్ టోటలిటేరియనిజం' పుస్తకంలో- నిజానికి, అబద్ధానికి తేడా తెలుసుకోలేని వ్యక్తులే నిరంకుశత్వానికి ఆదర్శవంతులంటారు. ఈ ప్రకటన నేటి కాలానికి మరింతగా వర్తిస్తుంది. జార్జ్ ఆర్వెల్ చెప్పినట్లు- సర్వత్రా మోసం ఆవరించిన రోజుల్లో సత్యాన్ని చెప్పడమే ఒక విప్లవాత్మక చర్య అవుతోంది. 'పోస్ట్-ట్రూత్' స్థితిలో వాస్తవాలకంటే వ్యక్తిగత భావోద్వేగాలు, అభిప్రాయాలు ప్రజాభిప్రాయాన్ని ఎక్కువగా ప్రభావితం చేస్తాయి. అంటే ప్రజలు తమకు నచ్చినట్టు ఉండే వాటినే నిజాలని నమ్ముతారు. దాంతో వారి నిర్ణయాలు తప్పుదారి పడతాయి. దానివల్ల అంతిమంగా సమాజమే నష్టపోతుంది. ప్రస్తుతం వాస్తవాల కంటే భావోద్వేగాలు, నమ్మకాలు లేదా వ్యక్తిగత కథనాలు ప్రజాభిప్రాయాలను రూపొందించడంలో ఎక్కువ ప్రభావం చూపుతున్నాయి. ఉద్ధృత ప్రచారం, తప్పుడు సమాచారం లేదా భావోద్వేగ కథనాలు ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. ఇరాన్-ఇజ్రాయెల్ ఉద్రిక్తతల సందర్భంలో ఈ 'పోస్ట్-ట్రూత్' భావన మరింత స్పష్టంగా కనిపిస్తోంది.

పశ్చిమాసియా యుద్ధంలో...

ఇజ్రాయెల్, ఇరాన్, వాటి మిత్రులు సమాచార యుద్ధంలో తలమునకలయ్యాయి. వార్తా కథనాలను నియంత్రిస్తూ ప్రపంచ దృష్టిని తమవైపు తిప్పుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి. భయం, కోపం, సానుభూతిని రేకెత్తించే కథనాలు తయారవుతున్నాయి. వాస్తవాలు మరుగునపడుతున్నాయి. బూటకపు, భావోద్వేగ అంశాలను సామాజిక మాధ్యమాలు వేగంగా వ్యాప్తి చేస్తున్నాయి. సత్యాన్ని గుర్తించడం కష్టతరం చేస్తున్నాయి. ఇజ్రాయెల్, ఇరాన్ రెండు దేశాలూ తమకు అనుకూలమైన కథనాలను రూపొందించి ఉద్ధృతంగా ప్రచారంలోకి తెచ్చాయి. ఇరాన్ అణ్వాయుధాలను తయారు చేయడానికి సన్నాహాలు చేస్తోందని, అది తన అస్తిత్వానికి ప్రమాదమని ఇజ్రాయెల్ తన దాడులను సమర్థించుకుంది. స్వదేశీయుల్లో భయాన్ని రేకెత్తించి ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ తనకు మద్దతు పెంచుకుంటున్నారు. ఇజ్రాయెల్ వాదనలకు కొన్ని పాశ్చాత్య ఇంటెలిజెన్స్ నివేదికలు విరుద్ధంగా ఉన్నాయి. ఇరాన్ అణు బాంబులను సిద్ధం చేయట్లేదని అవి చెబుతున్నాయి. ఇరాన్ అనుకూల వర్గాలేమో ఇజ్రాయెల్ నగరాలపై తమ క్షిపణి దాడులను అతిశయోక్తులతో వర్ణిస్తూ- ధ్రువీకరించని వీడియోలు, ఫోటోలను ప్రచారంలోకి తెచ్చాయి. ఇజ్రాయెల్ సైతం నకిలీ దృశ్యాలను సృష్టించినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఏఐ సాయంతో తయారుచేసిన, మార్చిన వీడియోలూ సోషల్ మీడియా పోస్టులు సమాచార యుద్ధాన్ని తీవ్రస్థాయికి తీసుకెళ్తున్నాయి. సమాచారంలో సత్యం కంటే కూడా దాని ప్రభావమే ముఖ్యమవుతోంది. అంతర్జాతీయ ప్రతిస్పందనలను అది మార్చేస్తోంది. ప్రజలు తమ విధేయతకు సరిపోయే విషయాలను వాటి వాస్తవికతతో సంబంధం లేకుండా నమ్ముతున్నారు. దాంతో ఎవరు బాధితులు, ఎవరు ఆక్రమణదారులనే నిజానిజాలు చీకటిలోకి జారిపోతున్నాయి.

ట్రంపే అతిపెద్ద ఉదాహరణ

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటనలు 'పోస్ట్-ట్రూత్' భావనకు బలమైన నిదర్శనాలు. అందుకే పోస్ట్-ట్రూత్ గురించి వెలువడిన చాలా పుస్తకాలలో ట్రంప్ మాటలే ఎక్కువసార్లు ఉదాహరణలుగా కనపడతాయి. అమెరికా 45వ అధ్యక్షుడిగా 2017-2021 మధ్యకాలంలో డొనాల్డ్ ట్రంప్ అసాధారణ వేగంతో, అత్యధిక స్థాయిలో అబద్ధాలు చెప్పారు. వాషింగ్టన్ పోస్ట్ విశ్లేషణ ప్రకారం- ఆయన అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే 2,140 తప్పుడు లేదా తప్పుదారి పట్టించే వాదనలు చేశారు. ట్రంప్ రోజూ సగటున ఆరు అవాస్తవాలను ప్రచారంలోకి తెచ్చారని మిచికో కాకుటాని అనే రచయిత 'ది డెత్ ఆఫ్ ట్రూత్' పుస్తకంలో రాశారు. ఇటీవల 'ఆపరేషన్ సిందూర్' విషయంలో ట్రంప్ చెప్పుకొన్న గొప్పలన్నీ ఇలాంటివే. అలాగే ఇరాన్ విషయంలోనూ ఇజ్రాయెల్ కథనాల్లాంటి వాటినే అమెరికా అధ్యక్షుడు వల్లెవేశారు. ఇరాన్ అణు కార్యక్రమాన్ని నిరోధించడమనే భావోద్వేగ ఆకర్షణలను ట్రంప్ ఉపయోగించుకున్నారు. ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడి చేయడం వెనుక తన పాత్రను తక్కువ చేసి చూపించే ప్రయత్నం చేశారు. ఇది సత్యాన్ని వక్రీకరించడమే. అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ కథనాలన్నీ 'పోస్ట్-ట్రూత్' స్థితిని స్పష్టం చేశాయి. జనాన్ని ఉద్వేగపరిచే తప్పుడు సమాచారం వెల్లువ కారణంగా సత్యం సాపేక్షమవుతోంది. ఈ పరిస్థితిని అర్థం చేసుకోవడానికి మూలాలను విమర్శనాత్మకంగా పరిశీలించడం, నిజానిజాలను ధ్రువీకరించుకోవడం అత్యవసరం.

నాశనమయ్యే వ్యక్తిత్వాలు

జార్జ్ ఆర్వెల్ రచించిన '1984' నవలలో విన్‌స్టన్ స్మిత్ ఒక ప్రధాన పాత్ర. తను ఒక సామాన్య వ్యక్తి. నియంతృత్వ సమాజంలో సత్యం, స్వేచ్ఛల కోసం పోరాడుతాడు. 39 ఏళ్ల అతను ఓషియానియా అనే దేశంలో మినిస్ట్రీ ఆఫ్ ట్రూత్‌లో పనిచేస్తుంటాడు. అందులో చరిత్ర రికార్డులను మార్చి, పార్టీ ప్రచారానికి అనుగుణంగా వాస్తవాలను వక్రీకరిస్తుంటారు. పార్టీ నియంత్రణ, అబద్ధాలను స్మిత్ రహస్యంగా ద్వేషిస్తాడు. ఆ వ్యవస్థలో భాగంగా ఉంటూనే, సత్యం కోసం ఆరాటపడతాడు. పార్టీ చెప్పే '2o2=5' వంటి అసత్య నినాదాలను ప్రశ్నిస్తాడు. నిరంకుశాధికారం, భయంకర నియంత్రణల చీకటి రూపాన్ని విన్‌స్టన్ జీవితం వెల్లడిస్తుంది. విన్‌స్టన్ అరెస్టు అయ్యి, బ్రెయిన్‌వాష్‌కు గురవుతాడు. చివరికి '2o2=5' అని నమ్మే స్థితికి వస్తాడు. అతని వ్యక్తిత్వం నాశనమవుతుంది. నేటి 'పోస్ట్-ట్రూత్' స్థితిలో సగటు మనుషుల్లో చాలామంది ఆర్వెల్ పాత్ర విన్‌స్టన్‌లా మారిపోయే ప్రమాదం మరెంతో దూరంలో లేదు.

# ఎదురుదాడితో...అక్రమాలను దాచలేము !

హైదరాబాద్,ఎదురుదాడి రాజకీయాల్లో ఇప్పుడు బిఆర్ఎస్, ఎపిలో వైకాపాలు ఆరితేరాయి. చేసిన తప్పులు, అప్పుల గురించి ఎవ్వరూ చర్చించుకోవద్దన్న పాలసీతో వీరు ఎదుటివారిపై బురదజల్లాలనే ప్రయత్నంలో ఉన్నారు. ఇద్దరూ ఒకే గూటి పక్షులుగా ఉన్నారు. ఎపిలో అప్పులు చేసి, బటన్ నొక్కుళ్లతో రాష్ట్రాన్ని దివాళా తీయించి, సొంత ఖజానా నింపుకున్న ఘనుడు జగన్. తెలంగాణలో కూడా కుటుంబం గుప్పిట్లో అధకారం పెట్టుకుని రాష్ట్రాన్ని దివాళా తీయించిన ఘనత కెసిఆర్ కుటుంబానిది. అంతేగాకుండా లెక్కకు మిక్కిలి అప్పులు చేసి ఇప్పుడేమో....మాకా సంగతే తెలియదన్న రీతిలో పోజులు పెడుతున్నారు. కెటిఆర్, హరీష్ రావుల విమర్శలు చూస్తుంటే సిగ్గేస్తోంది. జాలి కలుగుతోంది. ఎందుకంటే చేసిన తప్పులన్నీ చేసి, మళ్లీ తమదే అధికారం కనుక ఇవేవీ బయటపడవన్న ధీమాతో ఉండిపోయారు. కానీ ప్రభుత్వం మారడంతో అప్పులు, తప్పులు బయటకు తన్నుకు వస్తున్నాయి. వీటిని కప్పిపుచ్చుకునేందుకు రోజుకో అంశంపై విమర్శలు చేస్తున్నారు. గురుకులాలు, హాస్టళ్లు, రైతులు, బనకచర్ల, విద్యుత్ పంపిణీ తదితర అంశాలపై వీరు చేస్తున్న విమర్శలు అన్నీ ఇన్నీ కావు. నిజంగానే పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో ఇవన్నీ బాగావుంటే, బాగుచేసివుంటే ఇప్పుడే పాపం ఎందుకు బద్దయలయ్యిందన్నది ప్రజలు ఆలోచించాలి. అన్నింటికి మించి కాళేశ్వరంలో లక్షకోట్లు తగలేశారు. వారికి రావాల్సిన ముడుపులు రావడంతో ఏమయితే మనకేంటన్న ధోరణిలో ఉన్నారు. అందుకే ఇవన్నీ ప్రజలు చర్చించుకోవద్దన్న భావనలో రోజూ బనకచర్లను ముందుకేసి విమర్శలు చేస్తున్నారు. సిఎం ప్రజల్లోకి రావడమెందుకు, ఆయన ప్రజలను కలవాల్సిన పనేముందని వాదించిన కెటిఆర్ ఇప్పుడు పనిచేసే ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నాడు. నవ్విపోదురు నాకేంటి అన్న చందంగా కెటిఆర్,హరీష్ రావుల విమర్శలకు హద్దూపద్దూ లేకుండా పోతోంది. అలాగే జగన్ తీరు కూడా అలాగే ఉంది. వీరు దోచుకోవడం అన్న స్కూల్లో శిక్షణ పొంది వచ్చినవారు. ఇక కాళేశ్వరం నివేదిక చూస్తే ఆశ్చర్యం కలగమానదు. కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీల నిర్మాణంలో లోపాలు, వైఫల్యాల్లో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ పాత్ర కీలకమని జస్టిస్ పినాకిచంద్ర ఘోష్ కమిషన్ తేల్చింది. ఈ విషయంలో ఆయన పాత్ర విస్మరించలేనిదని స్పష్టం చేసింది. ఆయనతోపాటు ఆనాటి నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు, ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ తమ బాధ్యతలను సరిగా నిర్వర్తించలేదన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. అంతేకాకుండా.. అప్పటి సీఎంవో కార్యదర్శి స్మితా సబర్వాల్, ఈఎన్‌సీలుగా పనిచేసినవారు, మరికొందరు అధికారులను కూడా వైఫల్యాలకు బాధ్యులుగా పేర్కొంటూ నివేదిక రూపొందించింది. బ్యారేజీల నిర్మాణానికి మంత్రివర్గ ఆమోదమే తీసుకోలేదని తెలిపింది. బ్యారేజీలపై ముందుగానే నిర్ణయం తీసుకొని.. తుమ్మిడిహెట్టి వద్ద నీటి లభ్యత లేదన్న సీడబ్ల్యూసీ నివేదికను కేవలం సాకుగా చూపించారని వెల్లడించింది. పైగా బ్యారేజీల నిర్మాణానికి ముందు భూ భౌతిక పరీక్షలను శాస్త్రీయ ప్రమాణాలతో జరపలేదని పేర్కొంది. కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై విచారణ జరిపిన కమిషన్ గురువారం ప్రభుత్వానికి నివేదిక ఇవ్వగా.. దానిని శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అందజేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు నిర్మించేందుకు మంత్రివర్గం ఆమోదం తీసుకోలేదని, మంత్రివర్గ ఉపసంఘం వేసినా.. దీనికి, ఆ బ్యారేజీలకు సంబంధమే లేదని పీసీ ఘోష్ కమిషన్ తేల్చిందని తెలుస్తోంది. వీటి గురించి కెటిఆర్ మాట్లాడరు. హరీష్ రావు మాట్లాడరు. నోరుంది కదాని తప్పుడు మాటలతో మభ్య పెట్టే ప్రయత్నాల్లో ఈ ఇద్దరూ ఆరితేరారు. అయితే మంత్రివర్గ ఆమోదంతోనే బ్యారేజీలు నిర్మించినట్లు కమిషన్ క్రాస్ ఎగ్జామినేషన్‌లో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రులు టి.హరీశ్‌రావు, ఈటల రాజేందర్ చెప్పడం ఇంకా మోసం చేయడం తప్ప మరోటి కాదు. ఒక ఉద్యమ పార్టీగా




ప్రజల ఆకాంక్షలకు న్యాయం చేయకుండా వారి నమ్మకాన్ని దెబ్బతీసింది. ఒక కుటుంబానికి వ్యాపార సామ్రాజ్యంగా మారిందనడానికి కాళేశ్వరం సహా అనేక ఉదాహరణలు ఉన్నాయి. గొర్రెల పంపిణీలో వేయికోట్ల మోసం అంటే ఎంత దారుణమో గుర్తించాలి. ఒక ఉద్యమ పార్టీ ఎంతగా అహంకారంగా ప్రవర్తించిందో చూసాం. ప్రజలు ఎలా మోసపోయారో చూసాం. ఇందుకు కాళేశ్వరం, గొర్రెలు, చేపలు, రైతుబంధు వంటి అన్ని పథకాలు చూడవచ్చు. సిఎం రిలీఫ్ ఫండ్ పేరుతోనూ మోసాలు సాగించారు. ఇప్పుడు బీఆర్ఎస్ ఓటమిని జీర్ణించుకోలేక అనవసరంగా గట్టిగా రంకెలు వేస్తోంది. ఒక్కో అవినీతి బయటపడ్డా కొద్దీ జీర్ణించుకోలేక పోతున్నది. తెలంగాణ కోసం పోరాడిన ప్రతి కుటుంబం, ప్రతి యువకుడి ఆశయాల మీద చేసిన మోసపూరి రాజకీయం బహుశా చరిత్రలో ఎవరూ చేసివుండరు. ఒక నాయకుడు తప్పు చేస్తే దాన్ని ప్రజల ముందుకు తీసుకురావడం మీడియా బాధ్యత. కానీ ఇక్కడ పార్టీతో పాటు,ఓ కుటుంబం మోసం చేసింది. అయినా పదేళ్లుగా మీడియా ఈ విషయం ప్రసారం చేయలేదు. దాన్ని ఇప్పుడైనా ప్రశ్నించాలి. మీడియా స్వేచ్ఛను అణచివేయాలని చూసిన ఘనులు బిఆర్ఎస్ నేతలు. ప్రజాస్వామ్యంలో అది క్షమించదగినది కాదు. అసలు బీఆర్ఎస్ పార్టీ ప్రజాస్వామ్యాన్ని నమ్ముకుని అమ్ముకోవడమెలాగో నేర్చింది. ఇన్న తప్పులకు కారణమైన కెటిఆర్, హరీష్ రావులు ఇప్పుడు సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి చేస్తున్న విమర్శలు...దగుల్బాజీ రాజకీయాలకు పరాకాష్టగా చూడాలి. నిరాశా నిస్పృహల్లో ఉంటూ ప్రస్తుత పరిస్థితిని చూసి తట్టుకోలేని మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. అందుకే అసందర్భ ప్రేలాపనలు చేస్తున్నారు. రాజకీయాల్లో నీతిగా మాట్లాడటం బిఆర్ఎస్, వైకాపా నాయకులకు రాదు. వీరు పాలనార్హత లేనివారు. ప్రజల తీర్పును గౌరవించలేక, దాన్ని హేళన చేయడమంటే అది ప్రజల ను నిందించడమే అవుతుంది. జగన్, కెటిఆర్లు ఇది గమనించాలి. ప్రజలను అవమానిస్తున్న ఈ నేతలను ప్రజలు దూరంగా పెట్టాలి. బీఆర్ఎస్ పదేళ్ల పరిపాలనలో తెలంగాణకు సాధ్యమైనంత మోసం చేయమెలా అన్న రీతిలో పాలన సాగింది. ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్ష మేరకు అసలు ప్రజల జీవితాల్లో మార్పు తీసుకుని రాలేకపోయింది.రైతులు అప్పుల్లోనే ఉన్నారు, యువత నిరుద్యోగంలో ఉన్నారు. రుణమాఫీ రాయితీల పేరుతో కొంతమంది మాత్రమే లబ్ధి పొందారు. పేపర్ లీకులు, గ్రూప్ పరీక్షల వాయిదాలు, పోలీస్ పరీక్షల గందరగోళం ఇవన్నీ యువత భవిష్యత్తును నాశనం చేశాయి.బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో తెలంగాణ అప్పు రూ. 6.5 లక్షల కోట్లకు చేరింది. కాళేశ్వరం, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ ఇవన్నీ పేరుకి ప్రాజెక్టులు. కానీ అన్నీ అవినీతి పథకాలే. జేబులు నింపే పథకాలే. గ్రామాల్లోకి తాగునీరు, విద్య, ఆరోగ్య పరిరక్షణకు తీసుకున్నచర్యలు లేవు. ఇవన్నీ కూడా ఇక్కడ బిఆర్ఎస్‌కు ఎపిలో వైకాపాకు వర్తిస్తాయి.

# కమలానికి ఆటుపోట్లు ఇసికి ఓటు పాట్లు




న్యూఢిల్లీ,దేశంలో మూడోసారి బొటాబొటీ స్థానాలతో అధికారంలోకి వచ్చిన భారతీయ జనతా పార్టీ చుట్టూ సమస్యలు ముసురుకుంటున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా పార్టీ జాతీయ అధ్యక్షుడి ఎన్నిక విషయంలో జరుగుతున్న జాప్యం ఒకవైపు, ఆ పార్టీ మాతృసంస్థ అయిన ఆర్ఎస్ఎస్‌తో దూరం పెరిగినట్టు వస్తున్న వార్తలు మరోవైపు, రాష్ట్రాలలో పార్టీలో నాయకుల మధ్య అంతర్గత విభేదాలు బహిరంగం కావడం, వాటి మీద కేంద్ర నాయకత్వానికి పట్టు సడలిపోవడం, ఎన్నికల్లో అక్రమాలు చేసి అధికారంలోకి రావడం కోసం ఎన్నికల సంఘాన్ని దురుపయోగం చేస్తున్నారని ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ నాయకత్వంలోని 'ఇండియా' కూటమి చేస్తున్న ఆరోపణలు కేంద్రంలో అధికారంలో ఉన్న పక్షాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఇందులో ప్రధానంగా చెప్పుకోవాల్సింది జాతీయ స్థాయిలో పార్టీ అధ్యక్షుడి ఎంపికలో జరుగుతున్న జాప్యం. భారతీయ జనతా పార్టీ నియమావళి ప్రకారం అధ్యక్షుడిగా ఎన్నికయ్యే వ్యక్తి మూడు సంవత్సరాల పాటు ఆ పదవిలో కొనసాగుతారు. అదే వ్యక్తికి రెండవసారి కొనసాగింపు ఇచ్చే వెసులుబాటు ఉంది పార్టీ నియమావళిలో. అదే పద్ధతిలో ప్రస్తుతం కేంద్ర మంత్రిగా ఉన్న అమిత్ షా 2014 నుంచి 2020 వరకు అధ్యక్షుడిగా కొనసాగారు. తర్వాత అధ్యక్షుడైన జెపి నడ్డా 2020 నుంచి ప్రస్తుతం వరకు కొనసాగుతూనే ఉన్నారు. నిజానికి 2023 తోటే ఆయన పదవీకాలం పూర్తయింది.నియమావళిలో ఇచ్చిన వెసులుబాటు కారణంగా ఆయన మరో మూడేళ్ళ పాటు కొనసాగడానికి వీలున్నా అది అధికారికంగా ప్రకటిం చకుండా నూతన అధ్యక్షుడిని ఎన్నుకోనున్నట్టు అభిప్రాయం కలిగించారు. ఎందుకు కొత్త అధ్యక్షుణ్ణి ఎంపిక చేసుకోలేకపోతున్నారు అనే అంశం మాత్రం పార్టీ లోపల వెలుపల చర్చనీయాంశంగా మారింది ఇటీవల కాలంలో. ఇదే సమయంలో ఉపరాష్ట్రపతిగా ఉన్న జగదీప్ ధన్‌ఖడ్ హఠాత్తుగా అనారోగ్య కారణాలతో రాజీనామా చేయడం వెనుక ఉన్న అసలు కారణాలను గురించిన ఊహాగానాలు భారతీయ జనతా పార్టీకి ఇబ్బంది కలిగించే విధంగానే కొనసాగాయి.ఇక అంతర్గత విభేదాల విషయానికొస్తే ఇందులో తెలంగాణను గురించి ప్రధానంగా మాట్లాడుకోవాలి. ఎందుకంటే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన జరిగి రెండు రాష్ట్రాలుగా విడిపోయిన తర్వాత భారతీయ జనతా పార్టీ అధికారం కోసం తెలంగాణ రాష్ట్రం మీద దృష్టి సారించినట్టు స్పష్టంగా కనిపిస్తుంది. నిజానికి పదేళ్లకాలంలో 2023లో జరిగిన శాసనసభలో ఎన్నికల్లో ఎనిమిది స్థానాలు, 2024 లో జరిగిన లోకసభ ఎన్నికల్లో ఎనిమిది స్థానాలు గెలుచుకొని, ఆ తర్వాత కొద్ది రోజులకే రెండు శాసనమండలి స్థానాలను కూడా గెలుచుకొని ఇటీవలి కాలంలో లేని విధంగా బలాన్ని పెంచుకున్నదనడంలో సందేహం లేదు.పదేళ్ళు అధికారంలో ఉండి ఓటమి పాలైన భారత రాష్ట్ర సమితి స్థానాన్ని బిజెపి ఆక్రమించవచ్చునని వచ్చే శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను దీటుగా ఎదుర్కొనే పార్టీ బిజెపి అని ఒక అభిప్రాయం ఏర్పడుతున్న క్రమంలో పార్టీ అంతఃకలహాలు బయటపడడం ఆ వెనువెంటనే జరిగిన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నిక తీరు చూసినవారు భారతీయ జనతా పార్టీకి తెలంగాణ విషయంలో గతంలో ఉండిన పట్టుదల తగ్గిందా లేక పార్టీ మీద పట్టు సడలిందా అనే సందేహం కలగక మానదు. ఇతర రాజకీయ పక్షాలవలే కాకుండా భారతీయ జనతా పార్టీలో నాయకత్వానికి పార్టీ మీద ఉండే సహజమైన పట్టు సడలుతున్నదని తెలంగాణ పరిణామాలు చెబుతున్నాయి.ఇష్టానుసారంగా నాయకులు పార్టీ క్రమశిక్షణ రేఖ దాటి మాట్లాడటం అనేది కాంగ్రెస్ పార్టీ సొంతం. కాంగ్రెస్ పార్టీలో ప్రజాస్వామ్యం అవసరానికి మించి పొంగిపొరులుతూ ఉంటుంది. ముఖ్యమంత్రినైనా, ప్రధానమంత్రినైనా విమర్శించి పార్టీలో కొనసాగవచ్చు. టికెట్ రానందుకు నిరసనగా గాంధీభవన్ తగలబెట్టడానికి ప్రయత్నించి కూడా పదవులు పొందవచ్చునని గతంలో కాంగ్రెస్ నిరూపించింది.ఇప్పటివరకు బిజెపి ఇట్లా లేదు ఎంత పెద్ద నాయకులైనా సరే కట్టు తప్పితే సహించేది లేదనే ఆ పార్టీ రుజువు చేస్తూ వచ్చింది. ఇప్పుడు ఎందుకు ఈ పరిస్థితి ఏర్పడింది? తాజా ఉదంతమే తీసుకుంటే పార్టీ సీనియర్ నాయకుడు, మల్కాజిగిరి పార్లమెంటు సభ్యుడు ఈటల రాజేందర్ మరో సీనియర్ నాయకుడు, పార్టీ రాష్ట్ర శాఖ మాజీ అధ్యక్షుడు, ప్రస్తుత కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ మధ్య జరుగుతున్న మాటల యుద్ధాన్ని కేంద్రంలోని పెద్దలు ఆపలేకపోతున్నారనేది స్పష్టంగా కనిపిస్తున్నది. నూతనంగా రాష్ట్ర అధ్యక్ష పదవి స్వీకరించిన రామచంద్రరావు కూడా ఈ విషయంలో తానేమీ చేయలేక కేంద్ర నాయకత్వానికి విన్నవించుకున్నట్లు తెలిసింది. ఇద్దరు నాయకుల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు ఎటువంటివైనా, వాటిలో నిజానిజాలు ఎట్లా ఉన్నా తెలంగాణ రాష్ట్రంలో ఈ పరిణామాలు అన్నిటి కారణంగా భారతీయ జనతా పార్టీలో ఊపు తగ్గిపోతున్నదని జనంలో జరుగుతున్న చర్చ. ఇందుకు మరో ఉదాహరణ రాజాసింగ్ రాజీనామా ఉదంతం. ఆయన పార్టీకి చేసిన రాజీనామా అయితే ఆమోదించారు. కానీ ఆయన శాసన సభ్యత్వం సంగతి ఎటూ తేల్చలేదు. ఇప్పటికింకా ఆయన ఇంటి ముందు కమలం గుర్తులు కనిపిస్తూ ఉంటాయి.అతి త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్న క్రమంలో తెలంగాణలో భారతీయ జనతా పార్టీలో నెలకొన్న పరిస్థితి ఆ పార్టీని బలహీనపరిచే విధంగా ఉందని అనుకోవాలి. ఎనిమిది శాసనసభ స్థానాలు, ఎనిమిది లోకసభ స్థానాలు, రెండు శాసనమండలి స్థానాలు కలిగిన బిజెపి నాయకులు పొరపొచ్చాలు బయటకు రాకుండా చూసుకొని ఐక్యంగా పనిచేసి ఉంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో మెరుగైన ఫలితాలు సాధించి ఉండేవారా లేదా ఇప్పటిదాకా సాధించిన ఫలితాలు ఆయా సమయాలలో నెలకొన్న పరిస్థితుల కారణంగా అంది వచ్చిన తాత్కాలిక విజయాలా అన్న చర్చ జరుగుతున్నది. ఏ రాజకీయ పక్షం అయినా అటువంటి తాత్కాలిక విజయాలను ఓటు బ్యాంకుగా మలుచుకునే ప్రయత్నాలు చేస్తుంది. ఈ విజయాలను ఆధారం చేసుకుని మరింత బలపడేందుకు, పార్టీ నిర్మించుకునేందుకు ప్రయత్నిస్తుంది.

# అభివృద్ధికి,నాగరికతకు రహదారులు చిహ్నం

అమరావతి,అభివృద్ధికి, నాగరికతకు రహదారులు చిహ్నమని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఏపీలో నదులు, కాలువలు పుష్కలంగా ఉన్నాయి. ప్రపంచస్థాయి లాజిస్టిక్ హబ్‌లు తేవడమే మా లక్ష్యం అని అన్నారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ చొరవ వల్ల దేశవ్యాప్తంగా రోజుకు 37 కి.మీ పొడవైన హైవే నిర్మాణం జరుగుతోందన్నారు. మంగళగిరి వేదికగా నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రంలోని రూ.5,233 కోట్ల విలువైన జాతీయ రహదారులకు నితిన్ గడ్కరీ, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. తలపెట్టిన ప్రతి ప్రాజెక్టును సమర్థంగా పూర్తి చేసిన వ్యక్తి గడ్కరీ అని అన్నారు. ఆయన హయాంలో అనేక జాతీయ రహదారులు పూర్తయ్యాయని చెప్పారు. తొలి పీపీపీ మోడల్ రోడ్డును ముంబయి-పుణె మధ్య నిర్మించినట్లు- గుర్తు చేశారు. తలపెట్టిన ప్రతి ప్రాజెక్టును సమర్థంగా పూర్తి చేసిన వ్యక్తి గడ్కరీ. పోలవరానికి ఆయన ఇచ్చిన అండదండలు ఎప్పటికీ మర్చిపోలేమన్నారు. . గడ్కరీకి అంకితభావం, చిత్తశుద్ధి ఎక్కువ. ప్రజా చైతన్యం విషయంలోనూ చొరవ చూపే వ్యక్తి. పొలంలోనే గ్రీన్ హైడ్రోజన్ తయారు చేయాలని చెబుతుంటారు. ఆయన హయాంలోనే సాగర్ మాలా, భారత్ మాలా వచ్చాయి. ప్రపంచంలోనే మెరుగైన రోడ్ల వ్యవస్థ మనదే అవుతుంది. రాష్ట్రానికి మరో 20 పోర్టులు రాబోతున్నాయి. హబ్ అండ్ స్పోక్ మోడల్‌లో పోర్టులు నిర్మిస్తాం. మన రాష్ట్రంలో డ్రై పోర్టులు మరిన్ని వస్తాయి. అమరావతిలో 189 కి.మీ ఓఆర్ఆర్ నిర్మించమని అడిగాను. విశాఖ, విజయవాడకు మెట్రో ఇవ్వాలని కేంద్రాన్ని కోరాం. బయో ఇంధనం ఉత్పత్తిలోనూ వేగంగా చర్యలు తీసుకుంటున్నాం. అమరావతి, హైదరాబాద్, చెన్నై, బెంగళూరు మీదుగా బుల్లెట్ రైళ్లు కావాలి. వీటి ద్వారా 4 కోట్ల మంది ప్రయాణికులకు లబ్ధి జరుగుతుందని చంద్రబాబు అన్నారు. అభివృద్ధి, నాగరికతకు రహదారులు చిహ్నమని చంద్రబాబు నాయుడు ఉద్ఘాటించారు. పోలవరానికి కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ అండదండలు ఎప్పటికీ మరిచిపోలేమని నొక్కిచెప్పారు. గడ్కరీ అంకితభావం, చిత్తశుద్ధి చాలా గొప్పవని కొనియాడారు. గడ్కరీ హయాంలో అనేక హైవేలు పూర్తయ్యాయని ప్రశంసించారు. అసాధ్యమనుకున్న ప్రాజెక్టులనూ గడ్కరీ పూర్తిచేశారని గుర్తుచేశారు. అపారమైన నీటివనరులు ఏపీ సొంతమని సీఎం చంద్రబాబు ఉద్ఘాటించారు. ప్రపంచస్థాయి లాజిస్టిక్ హబ్స్ తీసుకురావాలన్నదే తమ లక్ష్యమని చెప్పుకొచ్చారు. విశాఖపట్నం, విజయవాడ మెట్రో ఇవ్వాలని కేంద్రాన్ని కోరామని గుర్తుచేశారు. అమరావతి, హైదరాబాద్, చెన్నై,బెంగళూరు మీదుగా బుల్లెట్ రైళ్లు కావాలని సూచించారు. బుల్లెట్ రైళ్ల ద్వారా నాలుగు కోట్లమంది ప్రయాణికులకు లబ్ధి కలుగుతోందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. అమరావతిలో 189 కిలోమీటర్ల పొడవైన ఓఆర్ఆర్ అడిగామని తెలిపారు. ఏపీ అడిగిన ప్రాజెక్టులపై గడ్కరీ సానుకూలంగా స్పందించారని.. హైవేల పక్కన పచ్చదనం పెరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. భవిష్యత్‌లో డ్రైవర్లు లేని వాహనాలు వస్తాయని వెల్లడించారు. అంతర్గత జలరవాణా మార్గాల అభివృద్ధిపై మరింత దృష్టి పెట్టామని చెప్పారు. ఏపీకి మరిన్ని డ్రై పోర్టులు రాబోతున్నాయని ప్రకటించారు. బయో ఇంధనం ఉత్పత్తిలోనూ వేగంగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

## కేంద్రమంత్రి గడ్కరీదే ఈ ఘనత

అమరావతి,అభివృద్ధిలో ఏపీ దూసుకుపోతోందని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. ఇవాళ రాష్ట్రానికి శుభదినమని చెప్పారు. ఎన్నికలకు ముందు రైతులకు ఇచ్చిన హామీని నిలబెట్టు-కున్నామని, అదే రోజు రోడ్లకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. మంగళగిరి వేదికగా నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రంలోని దాదాపు రూ. 5వేల కోట్ల విలువైన జాతీయ రహదారులకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ- సీఎం పవన్ కల్యాణ్, పలువురు కేంద్ర మంత్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. ప్రధాని మోదీ, చంద్రబాబు, పవన్ కల్యాణ్ వల్ల అన్ని రంగాల్లో ముందుకెళ్తున్నామన్నారు. రోడ్ల బడ్జెట్‌ను రూ.3 లక్షల కోట్లకు తీసుకెళ్లిన ఘనత గడ్కరీదే. ఆయన చొరవతోనే రోజుకు దేశవ్యాప్తంగా 30 కి.మీ హైవే నిర్మాణం జరుగుతోందన్నారు. రోడ్ల అభివృద్ధిపై అనేక కార్యక్రమాలు ఆధారపడి ఉంటాయి. రాష్ట్రంలో 28 రోడ్ల ప్రాజెక్టులు తలపెట్టాం. అవన్నీ నిర్ణీత సమయంలో పూర్తవుతాయి. సీఎం చంద్రబాబు తీసుకొచ్చిన పీ-4 కేవలం ఆంధ్రప్రదేశ్‌లోనే కాదు.. గడ్కరీ దగ్గర కూడా ఉంది. ఆయన పాజిటివ్, ప్రోయాక్టివ్, ప్రాక్టికల్, పీస్‌ఫుల్ (పీ-4) కేంద్ర మంత్రి. ఆయన వద్దకు వెళ్లినవారు నవ్వుకుంటూ బయటకు వస్తారు. పదేళ్లుగా నితిన్ గడ్కరీ పని చూసి చాలా ప్రభావితమయ్యా. 2014లో దేశంలో 74 విమానాశ్రయాలు ఉంటే ఇప్పుడు 162 అయ్యాయని రామ్మోహన్ నాయుడు తెలిపారు. పోలవరం ప్రాజెక్టు, విశాఖ ఉక్కుకు కేంద్రం అండగా నిలబడింది. విశాఖ రైల్వే జోన్‌కు అడుగులు వేగంగా పడుతున్నాయి. గతంలో చేయలేని అభివృద్ధిని ఇవాళ ఎలా చేస్తున్నామో ప్రజలు ఆలోచించాలి. రాష్ట్ర భవిష్యత్‌ను తొక్కుకుంటూ వెళ్లే నాయకులతో జాగ్రత్తగా ఉండాలి. ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం జరగాలి. మొక్క నాటి పెద్దదై ఫలాలు ఇచ్చే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. మంచి చెట్టు-ను కసాయికి అప్పగిస్తే మొత్తం చెట్టు-నే తొలగిస్తాడు. ఈ విషయాన్ని ప్రజలు గుర్తుంచుకోవాలి.

# 20వ విడత కిసాన్ సమ్మాన్ నిధి విడుదల

వారణాసి, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వారణాసి నుంచి పీఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజన 20వ విడత మొత్తాన్ని విడుదల చేశారు. సేవాపురిలోని బనౌలిలో జరిగిన కార్యక్రమంలో ఈ విడతను అధికారికంగా విడుదల చేశారు. ఈసారి దేశవ్యాప్తంగా 9.7 కోట్ల మంది రైతుల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా రూ.20,000 కోట్లు బదిలీ అయ్యాయి. ఈ పథకం ద్వారా రైతులకు ఏడాదికి మూడు విడతల్లో రూ.6,000 ఆర్థిక సాయం అందుతుంది. అంటే, ఒక్కో విడతలో రూ.2,000 చొప్పున నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోకి జమ అవుతాయి. అంతకుముందు, జూన్ 18, 2024న, ప్రధానమంత్రి మోదీ నుంచి రూ.9.26 కోట్ల మంది రైతుల ఖాతాలకు సమ్మాన్ నిధిని రిలీజ్ చేశారు. వారణాసి పర్యటనలో భాగంగా మోదీ దాదాపు రూ.2,200 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించడంతోపాటు- శంకుస్థాపన చేశారు. వీటిలో రోడ్లు, ఆసుపత్రులు, స్కూళ్లు సహా రకరకాల మౌలిక సదుపాయాలు ఉన్నాయి. ఈ ప్రాజెక్టులు వారణాసి ప్రజల జీవితాలను మరింత మెరుగుపరుచనున్నాయి. ఈ అభివృద్ధి ప్రాజెక్టులు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలను కూడా పెంచబోతున్నాయని తెలిపారు. ఇలాంటి ప్రాజెక్టులు రైతుల జీవితాలు, గ్రామీణ భారతాన్ని మరింత బలోపేతం చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో సిఎం యోగి తదితరులు పాల్గొన్నారు.

# రైతలకు అందుబాటులో సాంకేతిక పరిజ్ఞానం

ఒంగోలు, రైతులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకొస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. రైతు రాజుగా మారాలి. ఎన్ని కష్టాలు ఉన్నా.. ప్రజలు సుఖసంతోషాల తో ఉండాలనేది నా ఆకాంక్ష. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసినందుకు సంతోషంగా ఉందన్నారు. ఈ పథకాలతో పేదలను గట్టెక్కించాలన్నదే తన లక్ష్యమని చెప్పారు. ప్రకాశం జిల్లా దర్శి మండలం తూర్పు వీరాయపాలెంలో 'అన్నదాత సుఖీభవ' పథకాన్ని సీఎం చంద్రబాబు ప్రారంభించారు. లబ్ధిదారులకు చెక్కులు అందజేసిన అనంతరం.. పొలాల వద్ద వినూత్నంగా ఏర్పాటు చేసిన వేదికపై రైతులతో ముఖాముఖి నిర్వహించారు. రైతుల చెప్పిన సమస్యలపై స్పందించిన సీఎం.. వాటిని పరిష్కరించాలని అక్కడికక్కడే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలోని 46,85,838 మంది రైతులు 'అన్నదాత సుఖీభవ' ద్వారా లబ్ధి పొందనున్నారు. మొదటి విడతలో రాష్ట్ర వాటాగా ఒక్కో రైతుకు రూ.5 వేల చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేశారు. దీనికి తోడుగా కేంద్రం 'పీఎం కిసాన్' పథకం కింద మొదటి విడతగా రూ.2 వేల చొప్పున రైతులకు సాయం అందిస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి ఒక్కో రైతుకు రూ.7 వేలు చొప్పున జమ చేశాయి. ఒక్కో రైతు కుటుంబానికి కేంద్రం సాయంతో కలిపి ఏడాదికి రూ.20 వేలు అందించనున్నారు. ఇకపోతే గత ప్రభుత్వం వితంతు పింఛన్లు రద్దు చేసింది. మా ప్రభుత్వం రాగానే వితంతు పింఛన్లు మళ్లీ తీసుకొచ్చాం. లబ్ధిదారులు ఎక్కడుంటే .. అక్కడే పింఛన్ ఇస్తున్నాం. పింఛన్ల కోసం ఏడాదికి తెలంగాణ రూ.8వేల కోట్లు- ఖర్చు చేస్తుంటే.. ఏపీ రూ.32వేల కోట్లు- వెచ్చిస్తోంది. ఆగస్టు 15 నుంచి స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తాం. రాష్ట్రంలో ఎక్కడికైనా మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చు. దీంతో దాదాపు రూ.2.62 కోట్ల మంది మహిళలు లబ్ధి పొందుతారని సీఎం వివరించారు. ఎన్నికల ముందు అరాచక, దుర్మార్గపు పాలన నడిచింది. 2019లో చేసిన తప్పిదం వల్ల ప్రజల భవిష్యత్ అంధకారంలోకి వెళ్లింది. ప్రభుత్వ వ్యతిరేక ఓటు- చీలకూడదని జనసేన అధినేత పవన్ కల్యాణ్ మంచి ఉద్దేశంతో ముందుకొచ్చారు. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా జాతీయ పార్టీ భాజపాతో పొత్తు పెట్టుకున్నాం అనిచంద్రబాబు ఇవరించారు. ప్రజలకు హాని జరగకుండా ఉగ్రవాదులను మట్టుబెట్టాం. అభివృద్ధి చేయడం తెలిసిన పార్టీ తెదేపా అన్నారు. నిరంతరం ప్రజలతో మమేకమై పాలన సాగిస్తున్నామని అన్నారు. కేంద్రంలో భాజపా నాలుగోసారి కూడా అధికారం లోకి వస్తుందని, మోడీ పనితనమే ఇందుకు నిదర్శనమని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా మోడీ హవా పెరుగుతోందన్నారు. మంత్రులు అచ్చెన్నాయుడు, ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# పీసీసీ పగ్గాలు ఆమెకు ?

అమరావతి,ఏపీలో పీసీసీకి కొత్త సారధి వస్తారా అంటే ప్రచారం మాత్రం అలాగే ఉంది. 2024 జనవరిలో షర్మిలను ఏపీసీసీ చీఫ్ గా ఎంపిక చేశారు. ఆమె 2021లో తెలంగాణాలో వైఎస్సార్ టీపీని స్థాపించారు. ఆమె తన పార్టీని 2023 చివరిలో కాంగ్రెస్ లో విలీనం చేశారు. దానికి ఫలితంగా ఆమెకు ఏపీలో పార్టీ పగ్గాలు అప్పగించారు. ఆమె వల్ల కాంగ్రెస్ కి ఏ మాత్రం లాభం కలగలేదు కానీ టీడీపీకి భారీగా రాజకీయ లబ్ది చేకూరింది. చెల్లెమ్మ సెంటిమెంట్ పండి రాయలసీమ వ్యాప్తంగా వైసీపీ ఓటు బ్యాంకు కొట్టుకుని పోయింది. ఆ మేరకు టీడీపీ కూటమి గణనీయంగా లాభపడింది.

ఏ మాత్రం ఎత్తిగిల్లని పార్టీ :

ఇక 2024 జూన్ లో ఫలితాలు వచ్చిన తరువాత ఏపీలో టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చింది. పదిహేను నెలలుగా ఏపీలో పాలన సాగిస్తోంది. వైసీపీ ప్రతిపక్షంలోకి వచ్చింది. అయితే వైసీపీ అధికారంలో ఉన్నపుడు కాంగ్రెస్ అధ్యక్షురాలిగా షర్మిల ఎంచుకున్న రాజకీయ వ్యూహం కరెక్ట్ గా ఉంది. అధికార పార్టీని ఆమె విమర్శిస్తూ కాంగ్రెస్ ఆశలను హైప్ కి పెంచారు. కానీ వైసీపీ ఓటమి తరువాత కూడా ఆ పార్టీనే టార్గెట్ చేయడంతో ఆ పార్టీ గ్రాఫ్ ఏ మాత్రం పెరగలేదు. పైగా మరింతగా ఇబ్బందుల్లో పడింది.

సీనియర్లంతా సైలెంట్ :

కాంగ్రెస్ లో చాలా మంది సీనియర్ నేతలు ఉన్నారు. వారిలో ఎంపీలుగా కేంద్ర మంత్రులుగా రాష్ట్ర మంత్రులుగా చేసిన వారు అనేక మంది ఉన్నారు. వారంతా కాంగ్రెస్ పార్టీ మీద మమకారంతో ఇంకా కొనసాగుతున్నారు. వారిని కలుపుకుంటూ కాంగ్రెస్ అజెండాని జనంలో ఉంచాల్సిన షర్మిల ఆ విషయంలో వెనుకబడ్డారు అని అంటున్నారు. జాతీయ స్థాయిలో ఎన్డీయే కూటమికి ఇండియా కూటమి వ్యతిరేకంగా పోరాటం చేస్తోంది. ఏపీలో కూడా అదే తీరున ఎన్డీయే ప్రభుత్వం మీద దూకుడుగా పోరాటం చేయాల్సి ఉండగా షర్మిల ఎందులో సరైన వ్యూహాలను ఎంచుకోలేకపోతున్నారు. దాంతో సీనియర్లు సైలెంట్ అయ్యారు.

కొంతకాలంగా అదే చర్చ :

కాంగ్రెస్ పార్టీలో కొంతకాలంగా పీసీసీ చీఫ్ మార్పు అన్న దాని మీదనే చర్చ సాగుతోంది షర్మిల ఎంతకాలం కొనసాగితే అంతకాలం కాంగ్రెస్ కి ఇబ్బందే అని పార్టీ నేతలు ఢిల్లీ స్థాయిలో ఫిర్యాదులు చేస్తూ వస్తున్నారు అని ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పెద్దలు కూడా ఏపీలో పార్టీ విషయంలో సీరియస్ గానే అలోచనలు చేస్తున్నారు అని అంటున్నారు. ఈ విధంగా వారు షర్మిల ప్లేస్ లో కేంద్ర మాజీ మంత్రి బీసీ నేత అయిన కిల్లి కృపారాణీని ఎంపిక చేస్తున్నారు అని ప్రచారం అయితే సాగుతోంది.


ధీటైన మహిళా నేతగా :

ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా టెక్కలికి చెందిన కిల్లి కృపారాణి వైద్యురాలిగా సుప్రసిద్ధురాలు. సేవా కార్యక్రమాలను కూడా ఆమె జిల్లాలో నిర్వహించడం ద్వారా కాంగ్రెస్ అగ్ర నేతల దృష్టిలో పడ్డారు వైఎస్సార్ 2003లో పాదయాత్ర చేస్తున్నపుడు ఆమె పార్టీలో చేరారు. అలా వైఎస్సార్ ప్రోత్సాహంతో ఆమె రాజకీయంగా ఎదిగారు 2004లో ఆమె తొలిసారిగా శ్రీకాకుళం ఎంపీ స్థానానికి పోటీ చేసి అప్పటి టీడీపీ సిట్టింగ్ ఎంపీ కింజరాపు ఎర్రన్నాయుడు మీద ఓటమి చెందారు అయితే 2009లో ఆమె అదే ఎర్రన్నాయుడుని ఓడించి జెయింట్ కిల్లర్ అనిపించుకున్నారు.

సమర్ధవంతురాలుగా పేరు:

ఉన్నత విద్యావంతురాలిగా బలమైన కాళింగ సామాజిక వర్గానికి చెందిన మహిళగా జిల్లాలో ఉన్న ఆమె ప్రతిభను మెచ్చి యూపీయే టూ ప్రభుత్వంలో ఆమెకు కేంద్ర కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి పదవిని ఇచ్చారు. ఇక 2014లో సైతం ఆమె ఇతర పార్టీల నుంచి ఆహ్వానం వచ్చినా కాంగ్రెస్ నుంచే పోటీ చేశారు. అయితే 2019 ఎన్నికల ముందు మాత్రం వైసీపీలో చేరారు. అయితే అయిదేళ్ల వైసీపీ ఏలుబడిలో ఆమెకి ఏ విధమైన పదవులూ దక్కలేదు.దాంతో ఆమె తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరారు. 2024లో ఆమె టెక్కలి అసెంబ్లీ నుంచి పోటీ చేశారు. రాహుల్ గాంధీతో నేరుగా పరిచయం ఉన్న వారు కావడంతో పాటు ప్రజా సమస్యల మీద పోరాటం చేసే నేర్పు క్యాడర్ కి దగ్గరగా ఉండే ఓర్పు అన్నీ ఆమెకు ఉన్నాయని భావిస్తున్న హై కమాండ్ ఆమెకు పీసీసీ పట్టం కట్టబెడతారు అని ప్రచారం అయితే సాగుతోంది.

# కృష్ణా ప్రాజెక్టుల ఆలస్యం.. తెలంగాణ నేతలదే పాపం



హైదరాబాద్, కృష్ణా జలాల్లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిపోతున్నదని, ఆంధ్ర ప్రాంతానికి గోదావరి జలాలు కూడా తరలించుకుపోతున్నారని, తెలంగాణకు తీరని ద్రోహం జరుగుతున్నదని ప్రతిపక్ష బీఆర్ఎస్ నాయకులు, అధికార కాంగ్రెస్ నాయకులు తెగ ఆందోళన పడిపోతున్నారు. ఈ రాజకీయ పక్షాల నీటిప్రేమ నిజమైనదేనా? నిజంగానే తెలంగాణకు తీరని ద్రోహం ఇప్పుడే మొదలయిందా? తెలంగాణకు జరిగిన ద్రోహంలో ఎవరి పాత్ర ఎంత? ఒక్కసారి కృష్ణా ప్రాజెక్టు కింద వాస్తవంగా జరుగుతున్నది ఏమిటో లెక్కలు తీస్తే తప్ప ఈ రాజకీయ నాయకుల ఆందోళనలో నిజమెంతో బయటపడదని సాగునీటి రంగ విశ్లేషకులు చెబుతున్నారు. 'నిజమే! తెలంగాణకు కృష్ణా జలాల కేటాయింపులో అన్యాయం జరిగినమాట వాస్తవం. తెలంగాణ వచ్చే నాటికి ఆయా రాష్ట్రాలు వాడుకుంటున్న జలాల ప్రాతిపదికన కేటాయింపులు జరిగాయని నీటిపారుదల నిపుణులు చెప్పేమాట. కృష్ణా పరీవాహక ప్రాంతం అధికంగా ఉన్న తెలంగాణకు 299 టీఎంసీల జలాలను, ఆంధ్రకు 512 టీఎంసీలను కేటాయించారు. ఇవి తుది కేటాయింపులు కాదు' అని విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడే నాటికి బ్రజేష్ కుమార్ ట్రిబ్యునల్ కృష్ణాజలాల పంపిణీపై పనిచేస్తున్నది. కొత్త ట్రిబ్యునల్ ద్వారా అదనంగా కేటాయింపులు చేయించుకోవాలంటే ప్రాజెక్టులు పూర్తి చేసుకుని ఉండాలి. కానీ తెలంగాణలో ఏం జరిగింది? 'గతంలో కేటాయించిన 299 టీఎంసీలనే తెలంగాణ ఏ ఒక్క సంవత్సరమూ పూర్తిగా వాడుకోలేదు. వాడుకునే విధంగా ప్రాజెక్టులను పూర్తి చేయలేదు. కృష్ణా నీటిలో 299 టీఎంసీల నీటిని ఉపయోగిస్తే తెలంగాణలో 30 లక్షల ఎకరాలకు సాగునీరు అందించవచ్చు. కానీ కృష్ణా నీటిని పొందే ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్లగొండ, ఖమ్మం, రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో ప్రాజెక్టుల కింద మొత్తం సాగుభూమి ఎంత? ఎప్పుడయినా లెక్కలు తీశారా? సుమారు 41,60,000 ఎకరాలు. నాగార్జున సాగర్ ఎడమకాలువ (100 టీఎంసీలు), వరదకాలువ, ఎఎంఆర్‌పీ (30టీఎంసీలు), బీమా (20టీఎంసీలు), కల్వకుర్తి (30టీఎంసీలు), నెట్టెంపాడు (20టీఎంసీలు), పాలమూరు రంగారెడ్డి (90 టీఎంసీలు), కోయిల్ సాగర్, మూసీఇలా అన్ని ప్రాజెక్టుల కింద సుమారు 32 లక్షల ఎకరాలకు(ప్రాజెక్టుల డీపీఆర్‌ల ప్రకారమే) సాగునీరు ఇస్తామని ప్రాజెక్టులు మొదలు పెట్టారు. కొన్ని ప్రాజెక్టులు పూర్తయ్యాయి. ఇంకొన్ని సగంసగం పూర్తయ్యాయి. ఇంకొన్ని నత్తనడక నడుస్తున్నాయి. మొత్తం ఎన్ని ఎకరాలకు సాగునీరు అందుతున్నదో తెలుసా? అన్ని కృష్ణా ప్రాజెక్టుల కింద ప్రస్తుతానికి సాగు అవుతున్న భూమి 14 లక్షల ఎకరాలు మాత్రమే. పెట్టుబడేమో 32 లక్షల ఎకరాలకోసం పెట్టారు. సాగవుతున్నదేమో 14 లక్షల ఎకరాలు మాత్రమే. అది కూడా కాలం బాగా అయిన సంవత్సరాల్లోనే. కాలం కాస్త అటూ ఇటూ అయితే కాలువల కింద సాగుభూమి 8 లక్షల ఎకరాలకు మించదు' అని ఒక సాగునీటి విశ్లేషకుడు వివరించారు.కృష్ణాలో మన వాటా అని చెప్పుకొనే 299 టీఎంసీల నీటిని కూడా గత పదేళ్లలో ఏ ఒక్క సంవత్సరమూ పూర్తిస్థాయిలో వాడుకోలేని పరిస్థితి ఉందని నీటిపారుదల శాఖ అధికారులు సైతం అంగీకరిస్తున్నారు. 'మనమేమో మన వాటా వాడుకునే విధంగా ప్రాజెక్టులు పూర్తి చేయలేదు. ఆంధ్రప్రదేశ్ నాగార్జునసాగర్ కుడికాలువ, కృష్ణా డెల్టాతోపాటు పెద్ద ఎత్తున ఎత్తిపోతలు పూర్తి చేసుకుని తనకు రావలసిన వాటా కంటే నీటిని ఎక్కువగా ఉపయోగించుకుంటున్నది. ఇందులో తెలంగాణ పాలకుల చేతగానితనం తప్ప ఆంధ్ర ప్రాంతాన్ని తప్పుబట్టేది ఏముంది?' అని సాగునీటి వ్యవహారాలను దగ్గరగా గమనించే ఒక జర్నలిస్టు అన్నారు. ఉదాహరణకు 2024-25 సంవత్సరంలో తెలంగాణ ఉపయోగించుకున్న కృష్ణా జలాలు 286 టీఎంసీలు కాగా, ఆంధ్రప్రదేశ్ ఉపయోగించుకున్నజలాలు 718 టీఎంసీలు. 2014-15 నుంచి 2024-25 వరకు గత సంవత్సరం మాత్రమే గరిష్ఠంగా 286 టీఎంసీలు తెలంగాణ ఉపయోగించుకుంది. ఆంధ్రప్రదేశ్ ఒక్క పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారానే 206 టీఎంసీల నీటిని తీసుకుంది. హంద్రీనీవా నుంచి 30 టీఎంసీలు తీసుకుంది. ఇవి తుంగభద్ర నుంచి తీసుకునే 60 టీఎంసీల నీటికి అదనం. 'ఎవరిని తప్పు పడతారు? ఎవరిమీద ఎగిరెగిరి పడతారు? ఎవరి మీద ద్వేషాలు రెచ్చగొట్టి పబ్బం గడుపుతుంటారు? సాగునీటి సోయి బాగా ఉందని చెప్పుకొనే బీఆర్ఎస్ గత పదేళ్లలో కృష్ణా ప్రాజెక్టులు ఎందుకు పూర్తి చేయలేదు? ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఎందుకు మీనమేషాలు లెక్కపెడుతున్నది?' అనే ప్రశ్నలు సాగునీటి విశ్లేషకుల నుంచి వెలువడుతున్నాయి. జగన్‌మోహన్‌రెడ్డి మొదలుపెట్టి దాదాపు పూర్తి చేసిన రాయలసీమ ఎత్తిపోతల పథకం పూర్తయితే ఏపీకి మరో వంద టీఎంసీల నీటిని తరలించుకునే అవకాశాలు ఏర్పడతాయి. మొదట తవ్విన శ్రీశైలం కుడికాలువ 11,500 క్యూసెక్కులు, రాజశేఖర్‌రెడ్డి తవ్విన మరో 44,600 క్యూసెక్కుల కాలువ, ఇప్పుడు జగన్‌మోహన్‌రెడ్డి తెచ్చిన రాయలసీమ ఎత్తిపోతల పథకం 34,700 క్యూసెక్కుల కాలువ-మొత్తం రోజుకు 90,800 క్యూసెక్కుల చొప్పున సుమారు ఎనిమిది టీఎంసీల నీటిని తరలించే సామర్థ్యం ఆంధ్రప్రదేశ్‌కు ఏర్పడుతుంది. అంటే 30 రోజుల్లోనే 240 టీఎంసీల నీటిని తీసుకునే వ్యవస్థను ఆంధ్రప్రదేశ్ ఒక్క పోతిరెడ్డిపాడు రెగ్యులేటర్ ద్వారానే ఏర్పాటు చేసుకుంటున్నది.ఇంకా ఆశ్చర్యమేమంటే రాయలసీమ ఎత్తిపోతల ప్రాజెక్టుకు 800 అడుగుల నుంచి నీటిని ఎత్తిపోసుకునే విధంగా నిర్మాణం చేయడం. ఇవన్నీ ఉండగా ఇప్పుడు చంద్రబాబు నాయుడు బనకచర్లకు గోదావరి నీటిని తరలించడానికి మరో ప్రాజెక్టుకు శ్రీకారం చుడుతున్నారు. రెండు రాష్ట్రాల్లోనూ సమస్య వందలు వేల కోట్లు ఖర్చు చేసి కొత్తకొత్త ప్రాజెక్టులు తీసుకువస్తారు. కానీ ఆ ప్రాజెక్టుల ద్వారా వచ్చే నీటిని పొలాలకు, చెరువులకు మళ్లించే పనులు అంటే పిల్లకాలువల నిర్మాణం మాత్రం గాలికి వదిలేస్తారు. హెడ్‌వర్కుల మీద ఉన్న ప్రేమ పిల్లకాలువలపై ఉండదు. కాంట్రాక్టర్లకు, రాజకీయ నాయకులకు ఇద్దరికీ ఆసక్తి పెద్ద ప్రాజెక్టులపైన, భారీ బడ్జెట్‌లపైనే. రైతులు మాత్రం చకోర పక్షుల్లా నీటికోసం ఎదురు చూస్తూనే ఉంటారు. రికార్డు స్థాయిలో పెద్ద పెద్ద ప్రాజెక్టులు నిర్మించామని చెప్పుకునే కాంట్రాక్టర్లు, రాజకీయ నాయకులు చిన్నచిన్న పనులు పూర్తిచేసే విషయం వచ్చేసరికి ఎక్కడా కనిపించరు.

కృష్ణా నదిలో తెలంగాణ ఎన్ని నీళ్లు వాడుకుంది?

2014లో ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య జరిగిన ఒప్పందం మేరకు కృష్ణా నది జలాల్లో 299 టీఎంసీలు కేటాయించారు. అయితే కృష్ణా జలాల్లో 50:50 నిష్పత్తి ప్రకారం నీటిని వాడుకోవాలనే ప్రతిపాదన తెలంగాణ తెరమీదికి తెచ్చింది. కానీ, వాడుకునే వ్యవస్థ తెలంగాణకు ఉందా లేదా అన్నది నాయకులు మాట్లాడడం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ఇంకా పూర్తి కాలేదు. ఉదయసముద్రం పూర్తిస్థాయిలో నింపే పరిస్థితి ఇంకా రాలేదు. గట్టిగా నీళ్లు వదిలితే కాలువ గట్లు కొట్టుకు పోయే పరిస్థితి. భీమా కింద కాలువల నిర్మాణం ఇంకా పూర్తి కాలేదు. కల్వకుర్తి కింద కూడా పిల్ల కాలువలు ఇంకా పూర్తి చేయవలసినవి చాలా ఉన్నాయి. నెట్టెంపాడు ఎప్పటికీ పూర్తి కాదు. పాలమూరు రంగారెడ్డి పనులు రెండడుగులు ముందకు మూడడుగులు వెనుకకు అన్నట్టు సాగుతాయి. కృష్ణా ట్రిబ్యునల్ విచారణ జరుగుతున్న సందర్భంలో కృష్ణాపై తలపెట్టిన ప్రాజెక్టులను ముందుగా పూర్తి చేయవలసి ఉండె. కానీ కేసీఆర్ కృష్ణా ప్రాజెక్టులను బాగా నిర్లక్ష్యం చేశారు. ఎస్ఎల్‌బీసీని అసలు పట్టించుకోలేదు. పాలమూరు రంగారెడ్డికి కెటాయింపులే కానీ నిధులు ఇవ్వలేదు. బీమా, నెట్టెంపాడు పనులన్నీ పెండింగులోనే పెట్టారు. ట్రిబ్యునల్ తుది ఆదేశాలు వచ్చేలోపు ప్రాజెక్టులు పూర్తయితే నీటి కెటాయింపులను అడగడానికి అవకాశం ఉంటుంది. ఆ ప్రయత్నం చేయకుండా ఆంధ్రప్రదేశ్‌పై పెడబొబ్బలు పెడుతూ కొరడాలు తీసుకుని ఒళ్లు చరుచుకుంటూ ఉంటే ఏమి ప్రయోజనం ఉండదని విశ్లేషకులు తేల్చి చెబుతున్నారు.

# ఫిరాయింపుల పర్వం...



హైదరాబాద్,ఫిరాయింపుల పర్వం అనాదిగా కొనసాగుతున్నది. కలియుగంలోనే కాదు త్రేతాయుగంలోనూ ఫిరాయింపులు జరిగినట్లు చరిత్ర పుటల్లో సాక్షాలు ఉన్నాయి. త్రేతాయుగంలో శ్రీరామునికి రావణబ్రహ్మకు మధ్య భీకర యుద్ధం జరగడానికి కొన్ని రోజుల ముందు రావణుని సోదరుడు విభీషణుడు తన అన్న నిర్వాకం నచ్చక శ్రీరాముని చెంతకు చేరినట్లు పురాణాల్లో స్పష్టమవుతున్నది. ఇక్కడ విభీషణుడు అన్నను కాదని శత్రుపక్షానికి ఫిరాయించినట్లు ద్యోతకమవుతున్నది. ద్వాపర యుగంలోనూ సాక్షాత్తు శ్రీకృష్ణ భగవానుడు దాన వీర శూరుడైన కర్ణున్ని సంప్రదించి కౌరవ పక్షాన్ని వీడి పాండు పుత్రుల పక్షానికి ఫిరాయించాల్సిందిగా సూచన చేసినట్లు మహాభారతంలో ఉంది.కర్ణుడు ఉదయమే సూర్యునికి అర్ఘ్యమిచ్చి వెనుదిరిగిన సమయంలో శ్రీకృష్ణుడు మెల్లగా అక్కడికి చేరుకుని 'బావా' అని సంబోధించినట్లు చరిత్రలో ఉంది. అందుకు కర్ణుడు విస్తుపోయి, ఈ పిలుపులో ఏదో మర్మం ఉందనే ఆలోచనతోనే విషయమేమిటని శ్రీకృష్ణున్ని ప్రశ్నించగా, ఫిరాయింపు గురించి తన అభిమతాన్ని వివరించారని, అందుకు కర్ణుడు ససేమిరా అన్నారని విన్నాం. తనను ఆప్తమిత్రునిగా నమ్మిన సుయోధనున్ని వీడి రాలేనని, నమ్మిన సిద్ధాంతాన్ని వీడలేనని కర్ణుడు తెగేసి చెప్పినట్లు కూడా మహాభారతంలో ఉంది. కర్ణుడు సిద్ధాంతానికే కట్టుబడి ఉన్నాడని, శ్రీకృష్ణుని మాయలోపడి మిత్రద్రోహం చేయకుండా గట్టిగా నిలబడ్డారని స్పష్టమైంది. త్రేతాయుగం, ద్వాపరయుగంలో ఫిరాయింపుల ప్రస్తావన ఉన్నా కలియుగంలోనూ ఫిరాయింపుల పర్వాలు కొనసాగుతూనే ఉన్నాయి.తెలుగు రాష్ట్రాల్లోనే కాదు ఇతర రాష్ట్రాల్లో, పార్లమెంటులోనూ అనేక పర్యాయాలు ఫిరాయింపులు జరిగాయి.ప్రజలకు సేవ చేయడమే పరమావధిగా భావించి రాజకీయాల్లోకి వస్తున్న నాయకులు వివిధ సందర్భాల్లో ఒక పార్టీని వీడి మరో పార్టీలోకి మారడం (ఫిరాయించడం) జరుగుతూనే ఉన్నది. నాయకులు పార్టీ మారితే తప్పేమీ లేదు. అక్కడి నాయకత్వ వ్యవహార శైలి లేదా అనుసరిస్తున్న విధానాలు నచ్చకనో నాయకులు, కార్యకర్తలు తమకు నచ్చిన పార్టీలోకి ఫిరాయిస్తే ప్రశ్నించే వారెవ్వరూ ఉండరు. కానీ ప్రజల ఓట్లతో ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన వారే నైతిక విలువలకు తిలోదకాలు ఇచ్చి పార్టీ ఫిరాయించినప్పుడు చిక్కులు వస్తున్నాయి. ఫలానా పార్టీ గుర్తుపై పోటీ చేసినందున, ఓటర్లకు ఆ అభ్యర్థి పోటీ చేసిన పార్టీ సిద్ధాంతాలు నచ్చడమో లేదా వ్యక్తిగతంగా అభ్యర్థి గుణగణాలు నచ్చి చట్టసభకు గెలిపించారని, అది ఓటర్ల తీర్పుగా భావించాల్సిందే. కానీ అలా జరగడం లేదు.ప్రజల తీర్పుకు భిన్నంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు కొందరు ఆ పార్టీకి గుడ్‌బై చెప్పి తెల్లారేసరికి మరో పార్టీ కండువా కప్పుకుని ప్రజలకు షాక్ ఇస్తున్నారు. ప్రత్యర్థి పార్టీని తూర్పారబట్టి, అవసరమైతే బూతులు మాట్లాడి మర్నాడే ఆ పార్టీ గూటిలో ప్రత్యక్షం కావడం, ప్రజలు ముక్కు మీద వేలేసుకోవడం పరిపాటి అయ్యింది. ఇక ప్రజలు చేయగలిగిందేమీ లేదు. కాబట్టి ఏ పార్టీ గుర్తుపై గెలుపొందిన వారు తమ పదవీకాలం ముగిసేంత వరకూ అదే పార్టీలో కొనసాగేలా ఉన్నప్పుడే ప్రజాతీర్పును గౌరవించినట్లు అవుతుంది. పార్టీ ఫిరాయింపుల నిరోధానికి ఎన్నో చట్టాలు చేసినా, చట్టానికి సవరణలు చేసినా అడ్డుకట్ట వేయడం సాధ్యం కావడం లేదంటే లోపం ఎక్కడో కాదు చేసిన చట్టాల్లోనే అని స్పష్టమవుతున్నది. చట్టాలు కావాల్సిన వారికి చుట్టాలేనన్న సామెత ఉండనే ఉంది. చట్టాలు చేసేప్పుడే ఏదో ఒక దొడ్డిదారి ఉండనే ఉంటుంది.ఎందుకంటే భవిష్యత్తులో మనకూ ఆ దారి ఉపయోగపడుతుందేమోనన్న భావన కావచ్చు. 1985 సంవత్సరంలో రాజీవ్ గాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు రాజ్యాంగంలో పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని పొందుపరిచారు. ఈ చట్టం ప్రకారం ఒకటింట మూడో వంతు మంది ఎంఎల్ఎలు లేదా ఎంపిలు పార్టీ మారేందుకు అవకాశం ఉండడంతో పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం (10వ షెడ్యూలు) దుర్వినియోగం అవుతున్నదని భావించి, వాజ్‌పేయ్ ప్రధానిగా ఉన్నప్పుడు చట్ట సవరణ చేశారు. దీంతో చట్టసభకు ఎన్నికైన వారు రెండింట మూడో వంతు మంది పార్టీ మారేందుకు అవకాశం ఉంది. పార్టీ ఫిరాయించిన ఎంఎల్ఎపై స్పీకర్‌కు పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద అనర్హత వేటు వేయాల్సిందిగా పిటిషన్ దాఖలైతే వారం రోజుల్లోగా సదరు ఎంఎల్ఎకు నోటీసు జారీ చేయాలన్న నియమం ఉంది కానీ నిర్ణయం ఎన్ని రోజుల్లో తీసుకోవాలన్న గడువు ఏమీ లేదు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఫిరాయింపుల గురించి పక్కన పెడదాం. తెలంగాణలో తాజాగా జరిగిన ఫిరాయింపుల పర్వం గురించే చూద్దాం. బిఆర్ఎస్ నుంచి గెలుపొందిన ఎంఎల్ఎలు దానం నాగేందర్, తెల్లం వెంకట్రావు, కడియం శ్రీహరి కాంగ్రెస్ పార్టీలో చేరినందున, పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద వారిపై అనర్హత వేటు (శాసన సభ్యత్వాల రద్దు) వేయాలని బిఆర్ఎస్ ఎంఎల్ఎలు పాడి కౌశిక్ రెడ్డి, కెపి వివేకానంద జనవరి 15న సర్వోన్నత న్యాయస్థానంలో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేశారు. మరోవైపు ఎంఎల్ఎలు పరిగి (పోచారం) శ్రీనివాస్ రెడ్డి, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, కాలె యాదయ్య, టి. ప్రకాష్ గౌడ్, అరికెపూడి గాంధీ, గూడెం మహిపాల్ రెడ్డి, ఎం. సంజయ్

# కార్పొరేట్ స్థాయిలో శాశ్వత భవనాలు

హైదరాబాద్,ఇప్పటికే స్లాట్ బుకింగ్ విధానాన్ని తీసుకువచ్చి ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్న స్టాంప్స్ రిజిస్ట్రేషన్ శాఖ మరో అడుగు ముందుకేసింది. ప్రజలకు మరింత సమర్థవంతంగా పారదర్శకంగా ఒకే చోట సేవలను అందించడానికి వీలుగా సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలను పునర్వ్యవస్థీకరించడంతో పాటు- కార్పొరేట్ స్థాయిలో అత్యాధునిక సౌకర్యాలతో కార్యాలయాలను నిర్మించాలని నిర్ణయించింది. దీనిపై డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో రెవెన్యూ, హౌసింగ్, సమాచార మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం రెవెన్యూ కార్యదర్శి డి.ఎస్.లోకేశ్ కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజి రాజీవ్ గాంధీ హనుమంతుతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా ప్రజలకు అసౌకర్యం కలగకుండా, పరిపాలనకు ఇబ్బంది లేకుండా సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల పునర్వ్యవస్థీకరణ, కొత్త బిల్డింగ్ల నిర్మాణం ఉండాలని అధికారులకు సూచించారు. అంతిమంగా ప్రజల సంతృప్తే ప్రధానమనే అంశాన్ని దృష్టిలో పెట్టు-కొని పునర్వ్యవస్థీకరణ చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండగా వాటిలో 37 మాత్రమే సొంత భవనంలో ఉన్నాయని మిగిలినవన్నీ అద్దె భవనాలలోనే కొనసాగుతున్నాయని ఈ పరిస్థితిని మార్చడానికి అన్ని సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలను కార్పొరేట్ స్థాయిలో ఆధునిక సౌకర్యాలతో దశలవారీగా నిర్మించాలన్న ఆలోచన చేస్తున్నామని తెలిపారు. మొదటి విడతలో ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో నాలుగు లేదా ఐదు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టు-కొని ఒకే చోట ఇంటిగ్రే-టె-డ్ కార్యాలయాన్ని నిర్మించాలని నిర్ణయించినట్లు తెలిపారు. హైదరాబాద్ జిల్లాలో 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు గాను రెండు చోట్ల, రంగారెడ్డి జిల్లాలో 14కు గాను మూడు చోట్ల , మేడ్చల్ జిల్లాలో 12కు గాను మూడు చోట్ల, సంగారెడ్డి , పఠాన్‌చెరువు కలపి ఒకటి మొత్తం తొమ్మిది ప్రాంతాల్లో అత్యాధునిక వసతులతో కార్పొరేట్ స్థాయిలో ఇంటిగ్రే-టె-డ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల భవనాలను నిర్మించాలని నిర్ణయించినట్లు- వెల్లడించారు. ఆయా జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసుకొని ఇందుకు అవసరమైన భూమిని గుర్తించాలని అధికారులను ఆదేశించారు. ఇంటి గ్రేటెడ్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల వల్ల పనితీరు మెరుగుపడడమే కాకుండా పర్యవేక్షణ సులభమవుతుందని అవినీతిని కూడా తగ్గించవచ్చని, కార్యాలయాల మధ్య పనిభారం సమానంగా ఉండడంతో పాటు- దస్త్రాల ప్రాసెసింగ్ వేగవంతం అవుతుందన్నారు. మొదటగా హైదరాబాద్‌లోని గండిపేట, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, బాలానగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను, గచ్చిబౌలిలోని తెలంగాణ అకాడమి ఆఫ్ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ కార్యాలయంలో ఇంటిగ్రేటెడ్ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంగా నిర్మిస్తున్నామని తెలిపారు. ఈ ఇంటిగ్రే-టె-డ్ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం ఒక రోల్ మోడల్ గా ఉంటు-ందన్నారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారితో చర్చించి ఈ బిల్డింగ్ నమూనాకు తుది రూపునిస్తామని, వీలైనంత త్వరితగతిన ఈ భవనానికి శంకుస్థాపన చేసేలా అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

# రేషన్ కార్డుల ద్వారా సన్న బియ్యం పంపిణీ

పెద్దపల్లి,మంథని నియోజకవర్గంలో అర్హులైన కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులను రాష్ట్ర ఐటీ, మరియు పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పలు ముఖ్య ప్రకటనలు చేస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై వివరించారు. రేషన్ కార్డుల ద్వారా సన్న బియ్యం పంపిణీకి నాంది పలికింది. ప్రతి అర్హ కుటుంబం సకాలంలో సన్న బియ్యం పొందేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. సన్న బియ్యం సరఫరా సక్రమంగా జరిగేలా రెవెన్యూ అధికారులకు ప్రత్యేక సూచనలు జారీ చేసినట్లు వెల్లడించారు. సన్న బియ్యం పంపిణీపై రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ నెల సుమారు రూ. 3 వేల కోట్ల ఆర్థిక భారాన్ని భరించాల్సి వస్తోందని తెలిపారు. అయినప్పటికీ ప్రజల ప్రయోజనాల కోసం ఈ నిర్ణయం తీసుకున్నామని స్పష్టం చేశారు. మహిళలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేర్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని మంత్రి గుర్తుచేశారు. 'ఉచిత బస్ ప్రయాణం అమలు చేయడం ద్వారా ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా మహిళలు 200 కోట్ల ఉచిత టికెట్లను ఉపయోగించుకున్నారని తెలిపారు. అంతేకాకుండా, గత ప్రభుత్వం చేసిన అప్పులపై ప్రతీ నెల రూ. 6 వేల కోట్ల వడ్డీ చెల్లించాల్సి వస్తున్నప్పటికీ, సంక్షేమ పథకాలను ఎలాంటి ఆటంకం లేకుండా అమలు చేస్తున్నామని చెప్పారు. మంథని అభివృద్ధి కార్యక్రమాలను వివరించిన మంత్రి శ్రీధర్ బాబు, త్వరలో మంథనిలో మినీ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు-చేయనున్నట్లు- తెలిపారు. ఈ సంవత్సరం నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు చేసినట్లు- చెప్పారు. అదనంగా, 10,200 మందికి కొత్త రేషన్ కార్డులు అందజేసినట్లు- పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యం సంక్షేమం, అభివృద్ధి. మంథనిని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే నా కృతనిశ్చయం అని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. ప్రజాప్రభుత్వం ప్రజల గౌరవాన్ని పెంచే ఆలోచన చేస్తున్నదన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత ప్రజల బతుకుల్లో ఏదో మార్పు వస్తుందన్న ఆశతో ఎదురు చూశారన్నారు. కానీ గత బీఆర్ఎస్ ప్రభుత్వం కనీసం ఒక్క రేషన్ కార్డు ఇచ్చే ఆలోచన కూడా చేయలేదని ఆయన విమర్శించారు. గత ప్రభుత్వం 8 లక్షల కోట్ల వరకు అప్పులు చేసి కూర్చుంటే వాటిపై ప్రతి నెల 7వేల కోట్ల వడ్డి కట్టాల్సి వస్తోందన్నారు. అయినప్పటికీ ప్రజలకిచ్చిన మాట నిలబెట్టుకోవాలన్న ప్రయత్నంలో ఉన్నామన్నారు.ఎంత ఆర్థికభారమైనప్పటికీ ప్రభుత్వం భరించి ప్రజలకు ఒక్కపైసా ఖర్చు లేకుండా రేషన్‌కార్డు ఉన్న కుటుంబంలోని ప్రతి వ్యక్తికి 6 కిలోల సన్నబియ్యం అందిస్తున్నదన్నారు. ప్రభుత్వం ఏమి చేస్తున్నదని అడిగే వారికి జవాబు చెప్పాల్సిన అవసరం కూడా మాపై ఉన్నదన్నారు. దేశంలోని ఏ రాష్ట్రంలో లేని విధంగా వేలాది మందికి రేషన్‌కార్డు ద్వారా సన్నబియ్యం అందించే కార్యక్రమం చేపట్టింది కాంగ్రెస్ ప్రభుత్వమని ఆయన చెప్పారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజలకు ఏమి కావాలి వారిలో ఏ మార్పు తీసుకురావాలన్న ఆలోచన చేస్తున్నామన్నారు. అందులో భాగంగా ఆర్థికపరమైన ఇబ్బందులు ఉన్నప్పటికీ సన్నబియ్యం అందించాలన్న ఆలోచన చేయడం జరిగిందన్నారు. ఇల్లులేని నిరుపేదలకు ఇల్లు ఇచ్చే కార్యక్రమం చేపట్టామన్నారు. గతపదేళ్లలో ఒక్కసారి కూడా గ్రూప్ ఒన్ పరీక్షలు నిర్వహించ లేదన్నారు. ప్రజాప్రభుత్వం వచ్చిన తర్వాత వివిధ పరీక్షలు నిర్వహించి దాదాపు 65వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామన్నారు. 200 యూనిట్ల కరెంటు- ఉచితంగా అందజేస్తున్నామన్నారు. పేద వారికి భారం ఎలా తగ్గించాలన్న ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్నదన్నారు. 42శాతం బీసీ రిజర్వేషన్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చట్టం తీసుకొచ్చిందని దానికి రాష్ట్రపతి ఆమోదం ఇప్పించాల్సిన బాధ్యత తీసుకోవాలని ఇక్కడి బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేలను కోరుతున్నానన్నారు.

# జూబ్లీ ఉప ఎన్నికల బరిలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం?



హైదరాబాద్,భారత రాష్ట్ర సమితి సిట్టింగ్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ ఆకస్మిక మృతితో ఖాళీ అయిన జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నిక దగ్గర పడుతున్న కొద్దీ, నియోజక వర్గంలో ఎన్నికల వాతావరణం వేడెక్కుతోంది. జూన్ 6 న మాగంటి మరణించిన నేపథ్యంలో.. ఆరు నెలల లోగా అంటే డిసెంబర్ లోగా జూబ్లీ హిల్స్ ఉపఎన్నిక నిర్వహించ వలసి ఉంటుంది.అయితే.. ఇంకా ఎలక్షన్ కమిషన్,నోటిఫికేషన్ విడుదల చేయలేదు. ప్రధాన పార్టలు ఏవీ అభ్యర్థులను ప్రకటించలేదు. అయినా.. జూబ్లీ ఉపఎన్నికను ప్రధాన పార్టీలు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న నేపథ్యంలో నియోజకవర్గంలోనే కాదు రాష్ట్ర రాజకీయాల్లో ఎన్నికల వేడి ఎగసి పడుతోంది. ఈ నేపథ్యంలో.. అధికార కాంగ్రెస్ పార్టీ, ప్రధాన ప్రతిపక్ష పార్టీ బీఆర్ఎస్ తో పాటు బీజేపీ కూడా జూబ్లీ సీటును తమ ఖాతాలో కలుపుకోవాలని, వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నాయి. అభ్యర్థులను ప్రకటించక పోయినా.. పార్టీలు, ముఖ్యంగా ప్రధాన పార్టీల టికెట్ ఆశిస్తున్న ఆశావహులు ఓ వంక టికెట్ కోసం ప్రయత్నాలు సాగిస్తూనే, మరోవంక టిక్కెట్ ఖాయంగా వస్తుందన్న విశ్వాసంతో నియోజక వర్గంలో కార్యకర్తలు, అనుచరుల సమావేశాలు నిర్వహిస్తూ ఎన్నికలకు సిద్దమవుతున్నారు. అదలా ఉంటే సిట్టింగ్ స్థానం నిలబెట్టుకోవాలని బీఆర్ఎస్, ఇప్పటికే కకంటోన్మెంట్ ఉప ఎన్నికలలో గెలిచిన అధికార కాంగ్రెస్ పార్టీ జూబ్లీ సీటును కైవసం చేసుకుని.. జీహెచ్ఎంసీ ఎన్నికలకు, స్ట్రాంగ్ గ్రౌండ్ ప్రిపేర్ చేసుకోవాలని చూస్తుంటే.. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న సికింద్రాబాద్ లోక్ సభ స్థానం పరిధిలోని జూబ్లీ హిల్స్ అసెంబ్లీ నియోజక వర్గంలో కాషాయ జెండా ఎగరేయాలని బీజేపీ ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నాయి. కిషన్ రెడ్డి ఇప్పటికే నియోజక వర్గంలో కేంద్ర మంత్రి హోదాలో పర్యటించి, ప్రజల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి అధికారులను ఆదేశిస్తున్నారు.మరోవంక ప్రధాన పార్టీలు మూడింటిలోనూ.. మరీ ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీలో టికెట్ ఆశిస్తున్న ఆశావహుల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. నిజానికి ఎంఐఎం ఆమోదంతో.. గతంలో పోటీ చేసిన మాజీ క్రికెటర్' అజారుద్దీన్ పేరు ఆల్మోస్ట్ ఖరారైందనే ప్రచారం జరుగుతోంది. ఒక విధంగా ఆయన ప్రచారం కూడా ప్రారంభించారు. అయితే.. ఇప్పుడు తలపై ఫిరాయింపుల కత్తి వేళ్ళాడుతున్న ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, జూబ్లీహిల్స్ టికెట్ కోసం క్యూలో నిలబడినట్లు తెలుస్తోంది. అయితే.. దానం నాగేందర్ మాత్రం తాను టికెట్ కోరలేదని.. కానీ తనకు టికెట్ ఇస్తే.. జూబ్లీతో పాటుగా ప్రస్తుతం తాను ప్రాతినిధ్యం వహిస్తున్న ఖైరతాబాద్ నియోజక వర్గంలోనూ కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తానని అంటున్నారు. మరోవంక జూబ్లీలో ఎవరు గెలిస్తే వారు మినిస్టర్ అయ్యే అవకాశాలు మెండుగా ఉన్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీలో జూబ్లీ టికెట్ కోసం పోటీ ఎక్కవగా ఉందని అంటున్నారు. అదలా ఉంటే కొద్ది రోజుల క్రితం.. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్న ప్రభాకర్, జూబ్లీ టికెట్ కు సంబంధించి కీలక వ్యాఖ్యలు చేశారు. జూబ్లీ టికెట్ స్థానికంగా పనిచేసే వారికే కానీ.. నాన్ లోకల్ అంటే స్థానికేతరులకు ఇచ్చేది లేదని స్పష్టం చేశారు. అలాగే.. ఎంఐఎం, కాంగ్రెస్ టికెట్ ముస్లిం మైనారిటీకి ఇస్తేనే.. తమ మద్దతు ఉంటుందని షరతు విధించినట్లు తెలుస్తోంది. ఎంఐఎం షరతు విధించిన తర్వాతనే.. కాంగ్రెస్ నాయకత్వం అజారుద్దీన్ కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు పార్టీ వర్గాల్లో వినిపిస్తోంది. నియోజక వర్గంలో ఒక లక్షా 30 వేల వరకు ఉన్న ముస్లిం ఓట్లు అత్యంత కీలకం అయిన నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఎంఐఎం పత్వాను కాదన లేదని అంటున్నారు.అయితే.. దానం పైకి ఏమి చెప్పినా, ప్రస్తుత రాజకీయ సంక్షోభం నుంచి బయట పడేందుకు ఆయన ఢిల్లీ స్థాయిలోనూ పావులు కదుపుతునట్లు తెలుస్తోంది. ఒకే దెబ్బకు రెండు పిట్టలు అన్నట్లుగా.. అటు ఖైరాబాద్' స్థానానికి రాజీనామా చేసి ఫిరాయింపుల కేసు నుంచి బయట పడడంతో పాటుగా.. జూబ్లీలో గెలిచి ఎమ్మెల్యేగా కొనసాగడమే కాకుండా సిటీ ఖాతాలో మంత్రి పదవిని సొంతం చేసుకోవచ్చని దానం పెద్ద స్కెచ్చే వేశారని అంటున్నారు. ప్రధానంగా సుప్రీం కోర్టు, బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లోకి ఫిరాయించిన పది మంది ఎమ్మెల్యేల అనర్హత విషయంలో మూడు నెలల్లో ఖచ్చితమైన నిర్ణయం తీసుకోవాలని స్పీకర్ ను ఆదేశించిన నేపథ్యంలో దానం అనర్హతవేటు నుంచి తప్పించుకునేందుకు వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారని అంటున్నారు. పార్టీ ఫిరాయించిన మిగిలిన తొమ్మిది మంది ఎమ్మెల్యేల విషయం ఎలా ఉన్నా.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత బోణీ కొట్టి ఫిరాయింపుల ఖాతా ఓపెన్ చేయడంతో పాటుగా.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా కొనసాగుతూనే కాంగ్రెస్ టికెట్ పై సికింద్రాబాద్ లోక్ సభ స్థానం నుంచి పోటీ చేసిన దానం నాగేందర్ రాజీనామా చేసి, ఎంతో కొంత గౌరవ ప్రదంగా పక్కకుతప్పుకోవడం తప్ప మరో మార్గం లేదనీ.. అందుకే దానం నాగేందర్ జూబ్లీలో పోటీచేసే ఆలోచన చేస్తునట్లు తెలుస్తోంది. అయితే.. జూబ్లీ స్టోరీ ఇంకెన్ని మలుపులు తిరుగుతుందో.. అంతిమంగా ఏమి జరుగుతుందో ఇప్పుడే చెప్పడం కష్టం అంటున్నారు విశ్లేషకులు.

# ప్రజ్వల్ రేవణ్ణకు జీవితాంతం జైలు!

బెంగళూర్ :ప్రజ్వల్ రేవణ్ణపై లైంగిక దాడి కేసులో కోర్టు జీవిత ఖైదు విధించి సంచలనం సృష్టించింది. దేవెగౌడ మనవడిగా, ఎంపీగా ఉన్నప్పటికీ బాధితురాలిపై అత్యాచారానికి పాల్పడ్డారని కోర్టు తేల్చింది. మహిళలపై విచక్షణ లేని దాడులకు పాల్పడిన వారికి ఎంత రాజకీయ శక్తి ఉన్నా న్యాయం ముందు నిలవలేదని ఈ తీర్పు చాటింది.దేశ రాజకీయాల్లో అత్యంత సంచలన ఘట్టంగా ప్రజ్వల్ రేవణ్ణ అత్యాచార కేసు నిలిచింది. దేశ మాజీ ప్రధాని దేవెగౌడ మనవడు, మాజీ ముఖ్యమంత్రి కుమారస్వామి మేనల్లుడు అయిన ప్రజ్వల్ రేవణ్ణపై గత కొన్ని నెలలుగా వెల్లువెత్తుతున్న లైంగిక దాడుల ఆరోపణలు ఎట్టకేలకు న్యాయస్థానంలో నిశిత విచారణకు లోనయ్యాయి. బెంగళూరులోని ఎంపీలు, ఎమ్మెల్యేలపై నమోదైన క్రిమినల్ కేసుల విచారణకు ఏర్పాటైన ప్రత్యేక సెషన్స్ కోర్టు ప్రజ్వల్‌ను నేరస్థుడిగా తేల్చి, జీవితాంతం కఠిన కారాగార శిక్షను విధించింది. అత్యాచార బాధితురాలిపై తీసిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో వెలుగులోకి వచ్చిన ఈ కేసు రాజకీయంగానే కాకుండా నైతికంగా, మానవీయంగా పెద్ద దుమారమే రేపింది. 2021లో హసన్ జిల్లాలోని హొలెనరసిపురలో ఉన్న రేవణ్ణ కుటుంబానికి చెందిన ఫాం హౌస్‌లో ఇంటి పనిచేసే 48 ఏళ్ల మహిళపై అతను పలు మార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడని బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ అత్యాచారాన్ని ప్రజ్వల్ స్వయంగా వీడియో తీసి, అది బయటపెడతానని బెదిరింపులకు పాల్పడి, మౌనం పాటించమని ఆదేశించాడట. మొదట బాధితురాలు భయంతో ఎక్కడా ఫిర్యాదు చేయలేకపోయినప్పటికీ, ఆ వీడియోలు మీడియాలో తిరుగుతుండటంతో శారీరకంగా, మానసికంగా ఆమెలో ఆందోళన మొదలైంది. ఆ స్థితిలో ఆమె ఆత్మహత్యకు ప్రయత్నించాలనే ఆలోచనల్లోకి కూడా వెళ్ళినట్టు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ బీఎన్ జగదీశ్ కోర్టుకు తెలిపారు. ఇది ప్రజ్వల్ క్రూరమైన మానసిక స్థితిని స్పష్టం చేస్తోందని, రాజకీయ నేతగా ఉండి చట్టం గురించి పూర్తిగా తెలిసి కూడా ఇటువంటి నేరాలు చేయడం అసహ్యకరమని న్యాయవాది స్పష్టం చేశారు.ఇలాంటి ఘోరమైన నేరాలకు కఠిన శిక్ష తప్పనిసరని న్యాయవాది వాదించారు. ఇది ఒక ప్రత్యేక సంఘటన కాదని, ప్రజ్వల్ అనేకమంది మహిళలపై లైంగిక దాడులకు పాల్పడి, వీడియోలు తీసి వాటిని బ్లాక్ మెయిల్‌కు వాడిన అనుభవజ్ఞుడని చెప్పారు. ఈ కేసులో కోర్టు అతనిపై భారత శిక్షా స్మృతి సెక్షన్ 376(2) ప్రకారం జీవితకాల శిక్ష విధించడమే కాకుండా, ఐటీ చట్టం సెక్షన్ 66E ప్రకారం మూడు సంవత్సరాల అదనపు శిక్ష విధించింది. అంతేగాకుండా బాధితురాలికి రూ.11 లక్షల పరిహారాన్ని కూడా ఇవ్వాలని పేర్కొంది.తీర్పు





వెలువడే ముందు ప్రజ్వల్ కోర్టులో కన్నీటి పర్యంతమయ్యాడు. తాను ఇంజినీరింగ్ పూర్తి చేసిన విద్యార్థి, మెరిట్‌లో ఉండేవాడిని, తల్లిదండ్రులను గత ఆరు నెలలుగా చూడలేదని చెప్పాడు. “ఎన్నికల సమయంలోనే ఈ ఆరోపణలు ఎందుకు వచ్చాయి? నేను ఎంపీగా ఉన్నపుడు ఎవరూ ఈ విషయంలో నన్ను నిందించలేదు. ఎందుకు ఇప్పుడు ఇలా జరుగుతోంది?” అంటూ కోర్టులో విచారం వ్యక్తం చేశాడు. తనపై కుట్ర జరుగుతోందన్న భావనను కూడా వ్యక్తీకరించే ప్రయత్నం చేశాడు. అయితే కోర్టు మాత్రం అతని వాదనలను ఉపేక్షించకుండా, నేరం తీవ్రంగా ఉన్నందున జీవిత ఖైదు తప్పదని తేల్చింది. ఈ కేసు గత ఏడాది ఏప్రిల్‌లో జరిగిన లోక్‌సభ ఎన్నికల సమయంలో ఒక్కసారిగా వెలుగులోకి వచ్చింది. హసన్ లోక్‌సభ స్థానం నుంచి ప్రజ్వల్ పోటీ చేసిన తెల్లవారే సోషల్ మీడియాలో వీడియోలు వైరల్ కావడంతో పెద్ద దుమారం రేగింది. అనేకమంది మహిళలపై లైంగిక దాడులకు సంబంధించిన దృశ్యాలు బయటకు వచ్చి, ప్రజ్వల్ పతనానికి నాంది పలికాయి. ఘటన వెలుగులోకి రాగానే అతను జర్మనీకి పారిపోయినప్పటికీ, మేలో తిరిగి వచ్చి అరెస్టయ్యాడు. అతనిపై మొత్తం నాలుగు లైంగిక దాడి కేసులు నమోదయ్యాయి. ప్రస్తుత తీర్పు మొదటి కేసుకు సంబంధించినదిగా పేర్కొనబడింది. మిగిలిన కేసులపై విచారణ కొనసాగుతోంది.ఈ తీర్పుతో ప్రభావవంతులు, రాజకీయంగా శక్తివంతులైనవారు కూడా చట్టానికి అతీతులు కారనే సందేశాన్ని న్యాయ వ్యవస్థ స్పష్టంగా ఇచ్చిందని న్యాయవాది వ్యాఖ్యానించారు. ధనవంతులు, నాయకులు చట్టం నుంచి తప్పించుకుంటారని ఉండే అపోహను ఈ తీర్పు తొలగించిందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇది న్యాయ వ్యవస్థకు, బాధితులకు న్యాయం కలిగించడంలో ఒక మార్గదర్శకమైన తీర్పుగా చరిత్రలో నిలుస్తుందనే అభిప్రాయాలు వెల్లువెత్తుతున్నాయి.

# సింగపూర్ లో.. సముద్రాన్ని పూడ్చి ప్లాంట్ ఎలా కట్టారో తెలుసా ?



హైదరాబాద్,ఇటీవల సింగపూర్ పర్యటించిన చంద్రబాబు బృందం అక్కడ సముద్రాన్ని పూడ్చి నిర్మించిన ఒక దీవిలోని పెట్రోల్ ప్లాంట్ ని సందర్శించారు. ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతో నిర్మించిన ఈ ప్రాజెక్టు గురించి క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. ఒక సముద్రాన్నే పూడ్చి ప్లాంటు నిర్మించగా లేనిది.. అమరావతిలోని ఈ మాత్రం నీటిని పూడ్చడం ఎంత పని? కానీ ఇక్కడే జగన్ మార్క్ విధ్వంసమే ప్రధాన అడ్డంకిగా కనిపిస్తుంది. ఎందుకంటే ఆయన విచ్చలవిడిగా పెట్టిన ఖర్చు.. ప్రస్తుతం అమరావతి నిర్మాణానికి ఆటంకాలను సృష్టిస్తోంది. గత జ. మో. రె. (జగన్ మోహన్ రెడ్డి) పాలనలో ఐదేళ్ల పాటు అప్పు చేసి మరీ సంక్షేమానికి పెట్టిన ఖర్చు అక్షరాలా రెండున్నర లక్షల కోట్లు. ఇదంతా ఆయన గెలుపునకూ పనికి రాలేదు. రాష్ట్రానికీ పనికి రాలేదు. దీంతో ఎప్పటిలాగానే మళ్లీ మొదటికే వచ్చింది వ్యవహారం. జగన్ గానీ కాస్త విచక్షణతో రాజధాని గురించి ఆలోచించి ఉంటే పరిస్థితి వేరుగా ఉండేది. జగన్ పాలన ఎలా ఉందంటే తన ఓట్ల కోసం జనానికి జనం సొమ్ము దోచి పెట్టడం. మధ్యలో లిక్కర్ వంటి స్కాముల ద్వారా తను తన వాళ్లు జేబు నింపుకోవడం. జగన్ ఐదేళ్ల పాలనలో ఇది తప్ప మరేం చేయలేదన్నది వాస్తవం. ఈ మొత్తం వ్యవహారంలో అంతిమ లబ్దిదారు జనం కాదు జగన్ అన్నది జగమెరిగిన సత్యం. మూడు ముక్కలాట ఆడకుండా జగన్ బాధ్యతగా వ్యవహరించి ఉంటే అమరావతి నిర్మాణం ఈ పాటికి పూర్తయ్యేది. అదే జరిగితే.. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రెట్టింపయ్యేది. చేయాల్సిందంతా చేసి.. ఇక్కడి జనానికి పని లేకుండా పాడుబెట్టి అదేమంటే ఇది దేవతల రాజధాని కాదు- వేశ్యల రాజధాని అంటూ బురద జల్లడం. ఇక్కడ చేపలు పట్టడం తప్ప మరేమీ చేయలేమని కామెంట్లు గుప్పించడం వంటివి చూస్తుంటే.. జగన్ నిజంగానే రాక్షసుడా అనిపిస్తుంది. ఎందుకంటే ఎక్కడైనా ఒక మంచి కార్యం జరుగుతుంటే దాన్ని కాకుండా చెడగొట్టేవారిని రాక్షసులనే అంటారు. గతంలో దేవతలు యజ్ఞయాగాదులు చేస్తుంటే జగనాసురుడి వంటి రాక్షసులు ఇలాగే వ్యవహరించేవారు. జగన్ కూడా సరిగ్గా ఇలాగే అనిపిస్తున్నారు. సంకల్పం ఉంటే అన్నీ జరుగుతాయి. కానీ ఏదో ఒక వంక పెట్టి ఇటు జనానికి ఏదో ఇస్తున్నట్టు బిల్డప్ ఇచ్చి. ఆపై తాను బీభత్సంగా దోచుకుని.. చివరికి రాష్ట్రానికంటూ ఒక రాజధాని లేకుండా చేయడంలో మెయిన్ విలన్ గా జగన్ని తప్పక పరిగణించాల్సిందేనంటారు పరిశీలకులు. ఇలాంటి వారిని శాశ్వతంగా దూరం పెడితే తప్ప.. రాష్ట్రం రాజధాని బాగుపడదన్న మాట వినిపిస్తోంది.

# కవిత వెనుక ‘జీరో’ క్యాడర్!

హైదరాబాద్,కల్వకుంట్ల కవిత.. బీఆర్ఎస్ కు దూరంగా.. జాగృతిపేరుతో సొంతంగా ఎదుగడానికి అడుగులు వేస్తోంది. తండ్రి, సోదరుడికి దూరంగా బీఆర్ఎస్ కు వ్యతిరేకంగా అడుగులువేస్తోంది. బీఆర్ఎస్ పార్టీ ఓటమి తర్వాత తెలంగాణ రాజకీయాల్లో మరోసారి చర్చకు దారితీస్తోంది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కూతురు కల్వకుంట్ల కవిత రాజకీయ వైఖరి అందరినీ షాక్ కు గురిచేస్తోంది.. కష్టాల్లో ఉన్న పార్టీకి పునర్నిర్మాణం అవసరమైన ఈ సమయంలో, కవిత తీరుపై పార్టీ అంతర్గతంగానే తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఆమె వెంట పార్టీ శ్రేణులు లేకపోవడం, కేడర్‌లోనూ వ్యతిరేకత పెరిగిపోతుండటం ఈ చర్చకు ప్రధాన కారణం.

ప్రత్యర్థులకు ఊతం ఇస్తున్నారా?

బీఆర్ఎస్ ఇప్పుడు ప్రతిపక్షంలో ఉంది. ఈ సమయంలో పార్టీ శక్తివంతంగా పోరాడి, ప్రజల సమస్యల కోసం గొంతెత్తాలి. కానీ కవిత వ్యవహార శైలి మాత్రం ప్రత్యర్థులకు మద్దతుగా మారుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. సొంత తండ్రి కేసీఆర్, అన్న కేటీఆర్‌లకు వ్యతిరేకంగా పరోక్షంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు పార్టీ శ్రేణుల్లో అయోమయానికి దారితీస్తున్నాయి. ఇది పార్టీ పురోగతిని అడ్డుకుంటుందని పార్టీలోని కొందరు అభిప్రాయపడుతున్నారు.

పార్టీకి దూరమవుతున్న కవిత?

ప్రస్తుతం కవిత వెంట బీఆర్ఎస్ నేతలు, ముఖ్యంగా మధ్యస్థాయి కేడర్, నిలబడటం లేదు. ఒంటరిగా వెళుతున్న ఆమెతో కలిసి పనిచేయడానికి ఎవరూ ముందుకు రావడం లేదని స్పష్టమవుతోంది. ఈ పరిస్థితికి ప్రధాన కారణం ఆమె ఇటీవల వ్యవహరిస్తున్న తీరేనని పార్టీలో చర్చ జరుగుతోంది. ఇటీవల ఆమె రాసిన ‘ఓపెన్ లెటర్’ కూడా రాజకీయంగా పెద్దగా స్పందన పొందలేదు. ఈ లేఖ ద్వారా ప్రజల్లో తనకు మద్దతు ఉందనే ప్రచారం జరిగినా, వాస్తవానికి బీఆర్ఎస్‌లో ఆమెకు మద్దతు లేదనేది తేటతెల్లమవుతోంది.

షర్మిల తరహాలో…

దివంగత నేత వైఎస్ఆర్ కుటుంబంలో షర్మిల పరిస్థితిని గుర్తు చేస్తూ, ఇప్పుడు



కవితను కూడా అదే కోణంలో చూస్తున్నారు. వైఎస్ఆర్ మరణం తర్వాత షర్మిల తన సొంత రాజకీయ మార్గాన్ని ఎంచుకున్నట్లే, కవిత కూడా బీఆర్ఎస్ నుంచి బయటికి వెళ్లి తన సొంత మార్గాన్ని ఎంచుకోవచ్చని కొందరు భావిస్తున్నారు. అయితే, కష్టకాలంలో రాజకీయ చతురత చూపకుండా, కేవలం మీడియాలో కనిపించడం కోసం లేఖలు రాయడం, గిల్లికజ్జాలు పెట్టుకోవడం వంటివి ప్రజల్లో సానుకూలతను పెంచడం లేదని విశ్లేషకులు చెబుతున్నారు.

కవిత రాజకీయ భవిష్యత్తు

ఈ నేపథ్యంలో, కవిత రాజకీయ భవిష్యత్తుపై అనేక ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఆమె బీఆర్ఎస్ పునర్నిర్మాణంలో భాగం కాకపోతే, సొంత రాజకీయ దారి ఎంచుకుంటారా? లేక ఇది పార్టీకి మరింత నష్టాన్ని కలిగిస్తుందా? అనే అంశంపై చర్చ జరుగుతోంది.పార్టీకి ప్రజా మద్దతు లభించాలంటే, కేవలం మాటలు చెప్పడం కాకుండా, క్షేత్ర స్థాయిలో కష్టపడి పనిచేయడం అవసరం. ప్రస్తుతం బీఆర్ఎస్‌లో నాయకత్వ పునర్నిర్మాణం అవసరం. అందులో భాగం కావాలంటే కవిత తన వైఖరిని మార్చుకోవాలని, లేదంటే ఆమె వెంట ‘జీరో క్యాడర్’ అనే పరిస్థితి మాత్రమే మిగిలిపోతుందని..ఆమె ఒంటరిగా మారి.. రెంటికి చెడ్డ రేవడిలా మారుతుందని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# టీడీపీతో అసలు కుదరంటున్న బీజేపీ !

హైదరాబాద్,తెలుగుదేశం పార్టీతో బీజేపీ పొత్తుకు నో చెబుతోంది. ఎక్కడా ఏమిటీ అంటేనే మ్యాటర్ పొలిటికల్ గా వేరే అని అర్థం చేసుకోవాలి. ఏపీలో చూస్తే టీడీపీ పెద్దన్నగా ఉంది. బీజేపీ జనసేన వచ్చి చేరాయి. మూడు పార్టీలు కలసి కూటమి కట్టాయి. దాంతో బ్రహ్మాండమైన మెజారిటీ వచ్చింది. దివ్యంగా ప్రభుత్వం ఏర్పాడింది. కలసి ఉంటే కలదు సుఖం అనుకుంటూ ముందుకు సాగుతున్నాయి మిత్రపక్షాలు. కానీ తెలంగాణాలో మాత్రం సీన్ రివర్స్ గా ఉంది.


తెలంగాణాలో మాత్రం ఎందుకో :

తెలంగాణాలో బీజేపీ ఇపుడు రాజకీయంగా అవకాశాలు పెంచుకోవాలని చూస్తోంది. ఒక వైపు అధికారంలో కాంగ్రెస్ పార్టీ ఉంది. ఆ పార్టీకి చరిష్మాటిక్ లీడర్ రేవంత్ రెడ్డి సీఎం గా ఉన్నారు ఇక బీఆర్ఎస్ ప్రతిపక్షంలో ఉంది పదేళ్ళ పాటు తెలంగాణాను ఏలిన పార్టీగా బీఆర్ఎస్ ఉంది. పైగా కేసీఆర్ ఉద్యమకారుడిగా ఉన్నారు. తెలంగాణ మలి విడత పోరాటాన్ని విజయం వైపుగా నడిపిన క్రెడిట్ ని ఆయన ఖాతాలో వేసుకున్నారు అలా బీఆర్ఎస్ కి ఇంధనం ఇమేజ్ అన్నీ కేసీఆర్ అని వేరేగా చెప్పాల్సింది లేదు. ఈ మధ్యలో బీజేపీ ఉంది. బీజేపీ జాతీయ స్థాయిలో బలంగా ఉన్నా తెలంగాణాలో మాత్రం ఎందుకో ఎత్తిగిల్లలేకపోతోంది. పార్టీలో ఎక్కువ మంది నాయకులు ఉండడం కూడా బీజేపీకి ఇబ్బందిగానే ఉన్నట్లుంది దాంతో అందరినీ కలుపుకుని పోయే విధంగా బీజేపీ దృఢమైన నాయకత్వంతోనే ముందుకు సాగాల్సి ఉంది.

పొత్తుకు బీజేపీ నో :

ఇక బీజేపీకి పట్టణ ప్రాంతాలలో బలం ఉంది. రూరల్ బేస్ లో కమలానికి ఆదరణ తక్కువ అన్నది కూడా ఒక విశ్లేషణ గా ఉంది. టీడీపీ తెలంగాణాలో ఈ రోజుకీ కొన్ని ప్యాకెట్స్ లో కొంత ప్రభావం చూపించే స్థితిలో ఉంది. అలా బీజేపీ టీడీపీ జనసేనలకు కలుపుకుని ఎన్డీయే కూటమిగా ముందుకు సాగితే అధికారం దక్కుతుంది అన్న లెక్కలు ఉన్నాయి. అయితే ఈ రకమైన రాజకీయ సమీకరణ వల్ల తెలంగాణా వాదం ముందుకు వచ్చి అసలుకే ఎసరు వస్తుందని కూడా ఆలోచిస్తున్నారు. దాంతో టీడీపీతో పొత్తులు నో అని బీజేపీ చెబుతోంది.

ఒంటరిగానేనని క్లారిటీ :



తెలంగాణాలో టీడీపీతో కానీ జనసేనతో కానీ పొత్తులకు ఆస్కారం లేదని తెలంగాణా బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు స్పష్టంగా చెప్పారు. ఏపీలో రాజకీయం వేరు అక్కడ పరిస్థితులు వేరు, కానీ తెలంగాణా రాజకీయం వేరు పరిస్థితులు వేరు అని ఆయన అంటున్నారు. తెలంగాణాలో బీజేపీ ఈ కారణంగానే పొత్తుల వైపు చూడటం లేదని సొంతంగా పోటీకి సిద్ధపడుతోందని ఆయన వివరిస్తున్నారు.

ఏపీకి మాత్రమే ఎన్డీయే :

దీంతో ఏపీకి మాత్రమే ఎన్డీయే పరిమితం అని పక్కా క్లారిటీని అయితే బీజేపీ ఇచ్చేసింది. నిజానికి డబుల్ ఇంజన్ సర్కార్ అని బీజేపీ నినదిస్తుంది. ఎక్కడ అయినా పార్టీలు ఉంటే కలుపుకుని పోతుంది. కానీ తెలంగాణాలో మాత్రం టీడీపీని వద్దు అనేస్తోంది. అలా కనుక పొత్తు కూడితే బీఆర్ఎస్ కి రాజకీయ ఆయుధంగా మారుతుందని ఏపీకి చెందిన పార్టీతో పొత్తులని బీజేపీని మరింతగా రాజకీయ చెలగాటం ఆడుకుంటారని కలవరపడుతోంది అంటున్నారు. అందువల్లనే టీడీపీని దూరం పెడుతోంది అంటున్నారు. అయితే ఒంటరిగా బీజేపీ పోటీ చేస్తే ఫలితాలు ఎలా ఉంటాయో అన్న చర్చ ఉంది. చూడాలి మరి ఏమి జరుగుతుందో. ఈ పొత్తుల ఎత్తుల్లో ముందు ముందు నిర్ణయాలు ఏమైనా మారుతాయామో చూడాలి.

# రేవంత్,పొంగులేటి,కేవీపీ ఇళ్లన్నీ చెరువుల్లోనే : కేటీఆర్ సంచలన ఆరోపణలు



హైదరాబాద్,తెలంగాణ రాజకీయాల్లో మరోసారి మాటల తూటాలు పేలాయి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అధికార పార్టీ నేతలపై, ముఖ్యంగా సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నేత కేవీపీ రామచంద్రరావులపై తీవ్ర విమర్శలు గుప్పించారు. హైదరాబాద్‌లో చెరువుల పరిరక్షణ పేరుతో జరుగుతున్న ఏకపక్ష చర్యలను ఆయన తీవ్రంగా ఖండించారు.హైదరాబాద్ డెవలప్‌మెంట్ అథారిటీ నిబంధనల అమలులో వివక్ష చూపుతోందని కేటీఆర్ ఆరోపించారు. పేదలు చెరువుల చుట్టూ ఇళ్లు నిర్మించుకుంటే, హైడ్రా వెంటనే చర్యలు తీసుకుంటుందని, కానీ అధికార పార్టీ నేతలు, ముఖ్యంగా సీఎం రేవంత్ రెడ్డి, ఆయన సోదరుడు తిరుపతిరెడ్డి, మంత్రి పొంగులేటి, కేవీపీ రామచంద్రరావు చెరువులను ఆక్రమించి ఇళ్లు నిర్మించుకున్నా హైడ్రా మౌనంగా ఉందని ఆయన మండిపడ్డారు. “చట్టం అందరికీ సమానమా? లేక పేదలకే తప్పా?” అని కేటీఆర్ నిలదీశారు.కేటీఆర్ విమర్శలు కేవలం హైడ్రాకు మాత్రమే పరిమితం కాలేదు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణలో మత, ప్రాంతీయ వివక్ష లేకుండా అభివృద్ధి జరిగిందని, కానీ ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల మధ్య కలహాలు సృష్టిస్తోందని ఆరోపించారు. “ఇది మొదటి సంవత్సరం మాత్రమే... ఇప్పటికే విద్వేష రాజకీయాలు ఊపందుకున్నాయి. ఇది కొనసాగితే పరిస్థితులు మరింత దిగజారుతాయి” అని హెచ్చరించారు.రాబోయే ఎన్నికలపై కూడా కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీకి ఒక్క ఎమ్మెల్యే సీటు కూడా దక్కదని, ప్రజలు వారి కుతంత్రాలను గ్రహించారని, మళ్లీ బీఆర్ఎస్ వైపు మొగ్గు చూపుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కేటీఆర్ చేసిన ఈ సంచలన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. అధికార కాంగ్రెస్ దీనిపై ఎలా స్పందించనుందో వేచి చూడాలి. ఈ వ్యాఖ్యలు రాబోయే రోజుల్లో అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధానికి దారి తీయవచ్చని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. ప్రజల్లో నిబంధనలు, న్యాయం అమలులో ఉన్న వివక్షపై మరింత అవగాహన పెరిగే అవకాశం కనిపిస్తోంది.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com